

టమోటా.. లాస్!

రైతు వద్ద కేజీ రూ.4లే

- భారీగా పడిపోయిన ధర
- పెరిగిన దిగుబడులే కారణం
- కోత ఖర్చులు రాక ఆందోళన
- చేలను దున్నేస్తున్న రైతాంగం
- రైతు బజార్లలో కేజీ రూ.12
- రూ.20 చేయాలని డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : టమోటా ధరలు పతనమవుతున్నాయి. రోజు రోజుకూ ధరల్లో తగ్గుదల నమోదవుతోంది. రైతుబజార్లలో నిన్నమొన్నటి వరకూ కిలో రూ.10లకే విక్రయించారు. రైతుకు గిట్టుబాటు కావడంలేదనే కారణంతో రూ.2లు పెంచి కిలో రూ.12 చొప్పున ధర పెట్టారు. మరోపక్క బహిరంగ మార్కెట్లలోనూ కిలో రూ.15 నుంచి రూ.20ల ధర ఉంది. సైకిళ్ల, రోడ్లపై తోపుడు బండ్లపై కూరగాయలు విక్రయించే కొందరు చిల్లర వ్యాపారులు కిలో రూ.15లకే అమ్ముతున్నారు. ఈ ఏడాది లోకల్‌గా కడియం, సీతానగరం తదితర మండలాలకు చెందిన రైతు బజార్ల రైతులు పెద్దఎత్తున టమోటా సాగు చేపట్టడంతో పంట రైతు బజార్లకు భారీగా వచ్చి చేరుతోంది. మరోపక్క రావులపాలెం సమీపంలోని మడికి పరిసర ప్రాంతాల్లోనూ టమోటా సాగు పెరగడం, దిగుబడి బాగుండడంతో జిల్లావ్యాప్తంగా అన్ని హోల్‌సేల్ మార్కెట్లకు టన్నుల కొద్దీ టమోటాలు వచ్చిపడుతున్నాయి. ఈ ఏడాది వాతావరణం పూర్తిగా అనుకూలించడం, చీడపీడల బెడద చాలా తక్కువగా ఉండడంతో దిగుబడులు గణనీయంగా పెరిగాయి. టమోటా కూడా మంచి రంగు, సైజు, నాణ్యతతో మదనపల్లి, బెంగళూరు రకాలను తలదన్నేలా క్వాలిటీతో ఉండడంతో వినియోగదారులు సంతృప్తితో కొనుగోళ్లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన హోల్‌సేల్ టమోటా వ్యాపారులు చిత్తూరు జిల్లా మదనపల్లి, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి చాలా వరకూ దిగుమతులను మానుకున్నారు. ఇతర ప్రాంతాల కంటే ఇక్కడే రేటు తక్కువగా ఉండడంతో హోల్‌సేల్ వ్యాపారులు లోకల్ టమోటాలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

10 కిలోలు రూ.40లే

ఈ ఏడాది టమోటా సాగు రైతులకు కలిసి రాలేదు..ఆరంభం నుంచి ధర తగ్గుతూనే ఉంది. గతేడాది కేజీ టమోటా రూ.230లు ధర పలకడంతో రైతులు బంగారు పంటగా భావించారు. ఈ నేపథ్యంలో రైతులు టమాటా సాగుపై దృష్టి సారించారు.దిగుబడులు పెరగడంతో ధర పడిపోయింది. హోల్‌సేల్ మార్కెట్‌లో 10 కిలోల టమాటా ధర రూ.40లు మాత్రమే పలుకుతుంది.అంటే కేజీ రూ.4లు అన్నమాట. దీంతో రైతులు కోతకు ఆలోచిస్తున్నారు. ఎందుకంటే కోత ఖర్చులు రావడం లేదు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన రైతు మాచవరపు ఆదినారాయణ అయితే అర ఎకరం పొలంలోని టమోటా పంటను దున్నేశాడు.జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇటువంటి పరిస్థితులు ఉన్నాయి.

రైతుల కోసం కమిటీలు

రైతులు గగ్గోలు పెడుతుండడంతో జిల్లా అధికారులు కూరగాయలను సాగు చేసే రైతును ఆదుకునేందుకు చర్యలు ప్రారంభించారు. రైతుబజార్లకు చెందిన రైతులతో పాటు కూరగాయలు సాగు చేసే ఇతర ప్రాంతాల రైతులకు కూడా గిట్టుబాటు ధర లభించేలా జిల్లా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్లతో ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ రైతుకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తుంది. రైతులు పండించిన కూరగాయల దిగుబడి ఎక్కువగా ఉండి, ధరలు పడిపోయిన సమయంలో జిల్లాలోని అన్ని రైతు బజార్లకు వాటిని తీసుకొచ్చి విక్రయిస్తారు.దీని వల్ల రైతు నష్టపోకుండా కనీసగిట్టుబాటు ధర లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

దిగుబడులున్నా.. ధర లేదు?



రైతు బజార్లలో కిలో రూ.10-రూ.12 పెడుతున్నారు. కనీసం రూ.15లు పెట్టినా ఫర్వాలేదు. రూ.20లు అమ్మితే కొంత లాభం వస్తుంది.ఈ ఏడాది దిగుబడులు బాగున్నాయి. ధర కూడా అదే స్థాయిలో ఉంటే బాగుండేది. ఎకరం సాగుకు రూ.40 వేలు ఖర్చు పెట్టా. ప్రస్తుతం పంట పండినా లాభం మాత్రం లేదు.

- కవల శ్రీనివాసరావు, రైతు, రాజంపేట, సీతానగరం మండలం

రైతుల కోసమే కమిటీలు



ధర తక్కువగా ఉంటే రైతు తాము పండించిన కూరగాయలను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతాడు. ఈ పరిస్థితిని నివారించేందుకు కలెక్టర్ ఆదేశాలమేరకు కమిటీ ఏర్పాటు చేశాం. రైతు బజార్లలో పంటను విక్రయించుకోవడం వల్ల రైతు నష్టపోకుండా ఉంటాడు.

- సునీల్ వినయ్, మార్కెటింగ్ అధికారి



అనకొండలు!

కొండలను మింగేస్తున్న దొంగలు

- రోజూ యథేచ్ఛగా తవ్వకాలు
- వందలాది లారీల్లో తరలింపు
- అక్రమార్కుల జేబుల్లోకి రూ.కోట్లు
- సర్కారు ఆదాయానికి గండి
- దేచర్ల,గౌరీపట్నంలో ఇదీ సీన్
- అయినా పట్టని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆ ప్రాంతానికి వెళితే ఎక్కడ ఉన్నామో అని పించకమానదు.. ఎదురుకంటే చుట్టూ కొండలు తవ్వేసిన గోతులే కనిపిస్తాయి.. కేజీఎఫ్ సినిమాలో తవ్వేసిన కొండలు ఎలా కనిపిస్తాయో ఇక్కడ కూడా అలాగే కొండలు మాయమై 50 అడుగుల లోతు ఉన్న గోతులు దర్శనమిస్తాయి. ఇదెక్కడో మారుమూల కాదండోయ్..జిల్లా కేంద్రం రాజమహేంద్రవరానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేచర్లలో సీన్.. జాతీయ రహదారిపై వెళుతుంటే కారులో కూర్చున్నా అక్రమంగా తవ్వేసిన గ్రావెల్ గోతులు కనిపిస్తూనే ఉంటాయి. అయినా ఇప్పటి వరకూ ఏ ఒక్క అధికారి ప్రశ్నించిన దాఖలాలు లేవు.

కొండలు కరిగిపోయాయి..

కొండలు కొల్లగొడుతున్నారు.. అక్రమంగా కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు.. భూములను గుల్ల గుల్ల చేస్తున్నారు. జిల్లాలో ఎర్రమట్టి (గ్రావెల్) అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా ఈ అక్రమాలు మాత్రం ఆగడం లేదు. కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు, బోరుబావులు తవ్వేందుకు వాడే గులక రాళ్ల తవ్వకాలు బాగా పెరిగిపోయాయి. గత వైసీపీ హయాంలో ఇక్కడ అనేక హెక్టార్లలో కొండలు, ఎర్రమట్టి భూములు గోతులుగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొందరు పెద్దలుగా చలామణీ అయ్యే నేతల స్వార్థం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇసుక అక్రమ తవ్వకాలతో రోడ్డుకెక్కుతున్న నేతల వైఖరి మీద అనేక ఫిర్యాదులు వస్తున్న సంగతి తెలిసిందే. దానికి తోడు దేచర్లలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు పెరిగిపోవడం మరింత చర్చనీయాంశమవుతోంది. పంగిడి, గౌరీపట్నం గ్రామాల సమీపాన ఉన్న దేచర్లలో అనేక ఎర్రమట్టి కొండలు ఉన్నాయి.వాటిపై అక్రమార్కులు కన్నుపడింది. కనీసం ఏ విధమైన అనుమతులు లేకుండా యంత్రాలు పెట్టి తవ్వేసి,వందలాది లారీ గ్రావెల్‌ను తరలిస్తున్నారు.వీటి మీద కొందరు కూటమి నేతలే ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడ దందా బాగా పెరిగింది. గ్రామంలో మూడు నాలుగు చోట్ల గ్రావెల్ తవ్వేస్తున్నారు.అంతే కాకుండా రాతి కొండలను గుల్ల చేశారు.ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా కరిగిపోయిన పలు కొండలుదర్శనమిస్తాయి.లారీ గ్రావెల్ రూ.5 వేలకుపైగా విక్ర యిస్తున్నట్టు సమాచారం.ప్రభుత్వ అనుమతుల్లేకుండా తవ్వేస్తున్నా అడిగేవారే లేరు. గ్రామంలో ఎవరూ అడ్డుకునే సాహసం కూడా చేయలేక పోతున్నారు.

నేడు కొలతలు వేస్తాం..

ఇన్నాళ్లకు జిల్లా మైన్స్ అధికారులు మేమున్నామంటూ వచ్చారు..అది కూడా ఎవరి నుంచో వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దీంతో యంత్రాలను వదిలి అక్కడ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నవారు పరారయ్యారు. యంత్రాలను సీజ్ చేశారు. దీనిపై ఏడీ డి.ఫణిభూషణరెడ్డి ప్రశ్నించగా దాడులు చేసిన మాట వాస్తవమేనని.. దేచర్లలో ఎంత మేర అక్రమ తవ్వకాలు జరిగాయో శనివారం కొలతలు వేసి, సంబంధిత వ్యక్తులకు నోటీసులిస్తాం అన్నారు.

- డి.ఫణిభూషణరెడ్డి, మైన్స్ ఏడీ



ఎస్పీ కార్యాలయం వద్ద భారతానంద

గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

ఎస్పీకి భారతానంద వినతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణా అరికట్టాలని విశాఖ శ్రీ భారత్ శక్తి పీఠం అధ్యక్షులు, హిందూ మహాసభ దక్షిణ భారత ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ భారతానంద మహరాజ్ ఎస్పీ నరసింహ కిశోర్‌కి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా ఏపీ సరిహద్దు జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ నుంచి కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, రాజమండ్రి, విజయవాడ గుండా ఇతర రాష్ట్రాలకు గోవుల అక్రమ రవాణా జరుగుతుందన్నారు. పోలీసులు కేసులు పెడుతున్నా ఫలితం ఉండడం లేదన్నారు. గోకవరం మండలం కృష్ణుడిపాలెంలోని గోశాలలో ఐదారేళ్లగా కొన్ని వేల పశువులను సంరక్షణలో ఉంచడం జరిగిందని, కానీ అక్కడ ఒక్క గోవు లేదన్నారు. దీనిపై ఎన్‌జీవో సంఘాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు.ఇప్పటికైనా గోవుల అక్రమ రవా ణా అరికట్టాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

రీ సర్వేకు 139 బృందాలు

గోకవరం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): రోజువారీ సర్వే బృందాలకు నిర్దేశించిన ప్రకారం రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని జేసీ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. మల్లవరం గ్రామంలో రీ సర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనుల ప్రక్రియను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. సర్వే బృందాలు సగటున రోజుకు 15 ఎకరాల్లో సర్వే నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 139 బృందాలను నియమించామన్నారు. బృందాల నియామకం మేరకు తగిన పురోగతి కనిపించడం లేదన్నారు. జేసీ వెంట జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ,తహశీల్దార్ సాయిప్రసాద్, వీఆర్వో కోనా శ్రీను తదితరులు ఉన్నారు.



డ్రైవర్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న చెంగల్‌రెడ్డి

ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలందించాలి

ఆర్టీసీ జోనల్ ఈడీ చెంగల్‌రెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మెరుగైన, సురక్షిత రవాణా సేవలందించాలని ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ టి.చెంగల్‌రెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోను శుక్రవారం విజయవాడ జోన్ ఈడీ విజయరత్నంతో కలసి ఆయన సందర్శించారు. బస్‌స్టేషన్, గ్యారేజీలను పరిశీలించి మాట్లాడారు. ఆర్టీసీ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలన్నారు. కార్గో ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అధిక కేఎంపీఎల్, ఆదాయం తెచ్చిన డ్రైవర్, కండక్టర్‌లకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలను అందజేశారు. డిపో ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నం, గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి ఏర్పాట్లు చేయండి

- భక్తులకు ఇబ్బందిలేకుండా చూడాలి
- కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి
- అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.ఈ నెల 26వ తేదీన గోదావరి స్నానాలకు వేల సంఖ్యలో భక్తులు వస్తారని.. శివాలయాలు కిటకిటలాడతాయని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సీతానగరం మండలంలోని వంగలపూడి నుంచి పట్టిసీమ వీరభద్ర స్వామి దేవస్థానం, కొవ్వూరు గోష్పాదక్షేత్రం, రాజ మహేంద్రవరం పుష్కరఘాట్, మార్కండేశ్వర స్వామి దేవస్థానం, కోటిలింగాల ఘాట్లకు వేలాదిగా భక్తులు వస్తారన్నారు.పట్టిసీమలోని తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి వచ్చే భక్తులకు పుణ్యస్నానాలు, దర్శన సమాచారం అందే విధంగా కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.అన్ని శైవ క్షేత్రాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి ఘాట్‌లోనూ అవసరమైన బోట్లతో పాటు గజ ఈతగాళ్లను, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని చెప్పారు. రాజమహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లలోని మునిసిపల్ కార్యాలయాల్లో భక్తులకు సమాచారం అందించే కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా అన్ని శైవ క్షేత్రాల్లోనూ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్‌ఆర్‌డీఎఫ్ సిబ్బంది, రెస్క్యూ టీమ్, ఫైరింజన్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎల్.అర్జున్, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుష్మిత, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వేంకటేశ్వరరావు, డీపీవో శాంతామణి తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీశైలం స్పెషల్ టూర్

టూరిజం ఆర్డీ పవన్‌కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా రాజమహేంద్రవరం -విజయవాడ-శ్రీశైలం ఒక పగలు, రెండు రాత్రుళ్ల ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చామని పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు సీహెచ్.పవన్ కుమార్ వెల్లడించారు. 18 సీట్లు కలిగిన మినీ బస్ ఈ నెల 25న సాయంత్రం 4 గంటలకు పర్యాటక శాఖ కార్యాలయం నుంచి బయలుదేరి.. విజయవాడకు రాత్రి 9 గంటలకు చేరుకొని అక్కడి ప్రయాణికులను ఎక్కించుకొని శ్రీశైలం వెళుతుందన్నారు.27న రాత్రికి రాజమండ్రి తిరిగి చేరుకుంటుందని చెప్పారు.యాత్రలో శ్రీశై లంలోని భ్రమరాంబికా దేవి, మల్లికార్జున స్వామి, త్రిపురాంతకేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరీదేవి ఆలయాల దర్శనం ఉంటుందన్నారు. రాజమండ్రి నుంచి పెద్దలకు రూ.4,360, పిల్లలకు రూ.3,490, విజయవాడ నుంచి పెద్దలకు రూ.3,490, పిల్లలకు రూ.2,550 టిక్కెట్టు ధరగా నిర్ణయించామన్నారు. ఆహారం, ఇతర ఖర్చులు పర్యాటకులే భరించాలన్నారు. వివరాలు, బుకింగ్ కోసం 98486 29341 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

35 బ్లాక్ స్పాట్లు గుర్తించాం : జేసీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జేసీ చిన్నరాముడు ఆదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీతో సమీక్షించారు. జిల్లాలో జాతీయ రహదారులపై 27, రాష్ట్ర రహదారులపై 6, ఇతర 2 కలిపి మొత్తం 35 బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగిందన్నారు. బ్లాక్ స్పాట్లలో సరిపడా లైటింగ్, సైన్ బోర్డులు, బ్లింకర్లు, స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ రహదారుల్లోని కొన్ని ప్రదేశాల్లో గ్రీనరీ అభివృద్ధి చేయాలని సూచించారు.మోటార్ వాహనాల చట్టాన్ని అనుసరించి 2024లో 4వేల కేసుల ద్వారా రూ.8 కోట్ల 82 లక్షల 41 వేలు, 2023, 24లో 60 కేసుల్లో రూ.87 వేల 500 అపరాధ రుసుము కోర్టులు విధించాయన్నారు. రహదారి భద్రతపై అవగాహన కార్యక్ర మాల్లో ఎన్‌జీవోలు చొరవ చూపాలన్నారు.నేషనల్ హైవే హెల్ప్ లైన్(ఎమర్జెన్సీ) నెంబరు 1033పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు అరికట్టాలని చెప్పారు. శబ్ద కాలుష్య నివారణకు అనవసరంగా హారన్ మోగించకుండా సూచన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలకు వాహనం ఇస్తే తల్లిదండ్రులు కేసులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణకు హెల్మెట్, సీట్ బెల్టులను ధరించాలన్నారు. 2024లో మోటారు వాహనాల డ్రైవింగ్ నిబంధనల ఉల్లంఘనలపై 84 వేల కేసులు నమోదు చేసి రూ.3 కోట్ల 30 లక్షలు జరిమానా విధించామని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేశ్ పేర్కొన్నారు. 2025లో జనవరిలో 10 వేల కేసులు పెట్టి రూ.41 లక్షలు జరిమానా వసూలు చేశామన్నారు.కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ ఎస్‌బీవీ రెడ్డి,డీఎం హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు,ఎన్ హెచ్ ఏఐ పీడీ డి.సురేంద్రనాథ్,డీవైఈవో వాసుదేవరావు,ఆర్‌ఎంవో వినూత్న పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ పార్టీలు నిషేధించండి

నన్నయ వీసీ ప్రసన్న శ్రీ

వాహనదారులు అలెర్ట్ 7

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



రాజమహేంద్రవరం అర్బన్ : రాజమహేంద్రవరంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఇన్నీసుపేట బ్రాంచి వద్ద శుక్రవారం సాయంత్రం ఉద్యోగులు ధర్నా చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మార్చి 3వ తేదీన దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని.. దానికి మద్దతుగా శుక్రవారం ధర్నా చేశామని బ్యాంకు ఉద్యోగుల సంఘం (యూఎఫ్‌బీయూ) నాయకులు పాపారావు, శ్రీనివాసరావు తెలిపారు.



ప్రచార జోరు

ఎమ్మెల్సీ ఎన్నిక దగ్గర పడుతోంది.. ఇక మిగిలింది నాలుగు రోజులే.. ఎందుకంటే ఈ నెల 27వ తేదీనే ఎన్నికలు జరుగనున్నాయి.. ఈ నేపథ్యంలో నాయకులు ప్రచార జోరు పెంచారు..ఊరూవాడా పర్యటిస్తున్నారు.. పట్టభద్రులను కలుస్తున్నారు.. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.. పెరవలి మండలం ఖండవల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్‌ని చూడవచ్చు.

8

అచ్చు గుద్దినట్టు..



నేడు కవలల దినోత్సవం

ఈరోజు కవలల దినోత్సవం. ఏడాదిలో ఫిబ్రవరి రెండో నెల. ఆ నెలలో 22వ తేదీన కవలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతోంది. ప్రముఖ మెజీషియన్ చొక్కాపు వెంకట రమణ దీన్ని ట్విన్స్ డేగా ప్రకటించ దంతో అప్పటి నుంచి ఇది కవలల దినోత్సవంగా మారింది. సాధారణంగా కవలల్లో ఇద్దరూ ఆడ లేదా మగ పుడతారు. అరుదుగా ఒక ఆడ, ఒక మగ పిల్లలూ జన్మిస్తారు. ఒకే రంగు, రూపు, ఎత్తు, జుట్టు ఇలా శరీర నిర్మాణపరంగా 90 శాతం పైగా ఒకేలా ఉంటూ చూపరులను గందరగోళపరుస్తారు. కుటుంబీకులు సైతం తికమక పడేలా అచ్చుగుద్దినట్టు కొందరుంటారు. ఇలా విశేషమైన ఒకే తీరు లక్షణాలతో జన్మించిన కొందరి పరిచయం ఇలా..

దివాన్‌చెరువుకు చెందిన కవలలు మట్ట ప్రవణశ్రీ, ప్రజ్ఞశ్రీ

ఇద్దరూ.. ఒకేలా..

అచ్చం ఒకరిని పోలి ఒకరు.. రూపం ఒకటే కానీ వ్యక్తులు ఇద్దరు. దివాన్‌చెరువుకు చెందిన మట్ట దుర్గారావు, దుర్గాప్రసన్న దంపతులకు ప్రజ్ఞశ్రీ, ప్రవీణశ్రీ కవలలుగా జన్మించారు. వీరు ఇద్దరూ అచ్చం ఒకరిని పోలి ఒకరు ఉంటారు. ప్రస్తుతం తమ కుమార్తెలు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తండ్రి దుర్గారావు తెలిపారు. తమ కుమార్తెలను గుర్తించేందుకు బయటి వ్యక్తులు తికమక పడుతుంటారని ఆయన చెప్పారు.

- దివాన్‌చెరువు



అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న కవలలు

అంబాజీపేట గ్రామానికి చెందిన వర్షిణి, హర్షిణి ఇద్దరు కవలలు. వీరిద్దరు అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. అలాగే మాచవరం గ్రామానికి చెందిన సాయిచరణ్, భువనేశ్వరి ఇద్దరు కవలలు. వీరు కూడా ఇదే హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నారు. ఇక్కడే ఎనిమిదవ తరగతి చదువుతున్న అంబాజీపేటకు చెందిన కవలల ధరణి, దర్శినిలు ఎప్పుడూ ఒకే రకం దుస్తులతో కనిపిస్తారు. దాంతో వారిని పోల్చుకోవడం కష్టమే. ఏడో తరగతి చదువుతున్న బెరీషా, బెహర్నాలది అంబాజీపేట.

- అంబాజీపేట



తికమక..మకతిక..

వీరు మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన కోట రామకుమార్, కోట రాకేష్‌లక్ష్మణ్ 1995లో జన్మించారు. వారద్దరినీ ఒకేసారిచూస్తే బంధువులు, స్నేహితులు గుర్తుపట్టలేక తికమకపడుతుంటారు.



సత్య రితిక్, సత్య రూపక్

రూపమే కాదు.. గుణాలు ఒకటే!

కవలలైన తమ పిల్లలు రూపంలోనే కాదు.. గుణగణాల్లోనూ ఒకేలా ఉంటారని కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన కొండేపూడి బుల్లిరాజు, సూర్యకుమారి దంపతులు చెప్పారు. ఒక్కోసారి తమ పిల్లలను గుర్తించే విషయంలో తాము కూడా పొరబడుతుంటామన్నారు. ప్రస్తుతం వీరు కోటిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. - కె.గంగవరం



వర్షిణి.. వర్ధిని

వీరు కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన టీడీపీ నాయకుడు గుబ్బల మూర్తి కుమార్తెలు వర్షిణి, వర్ధిని. వీరిద్దరూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. - కొత్తపేట





ఒకే రూపు.. అదే తీరు.. భలే పేర్లు!

కరప మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన పులపకూర వెంకటరమణ, ఝాన్సీరాణి దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరికి ఐదేళ్ల వయసున్న ఇశితాప్రియ, ఇన్విితాప్రియ అనే కవల పిల్లలు ఉన్నారు. కరప గ్రామానికి చెందిన రెడ్డి వీరవెంకటసత్యనారాయణ (వీరబాబు), సూర్యకుమారి దంపతులకు 11 ఏళ్ల కింద ఒక మగ, ఒక ఆడబిడ్డ జన్మించారు. వీరికి తన తల్లిదండ్రులు వీరవెంకట సత్యనారాయణ, సూర్యకుమారి పేర్లు పెట్టుకున్నారు. తాతనానమ్మ, తల్లిదండ్రులు, మనవళ్ల పేర్లు ఒక్కటే కావడం ఇక్కడ విశేషం.

- కరప

ఒకే ఊరిలో 110 మంది కవలలు

బావి నీరు కారణమంటున్న దొడ్డిగుంట వాసులు



ఇది చదివాక.. కవలల పుట్టినిల్లు అనాలేమో. రంగంపేట మండలం పెద్దదొడ్డిగుంటలో ఏకంగా 110 కవల జంటలు జన్మించారు. దీనికి కారణం తమ ఊరిలో ఉన్న బావినీరే కారణమని చెబుతారు. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ బావి నీటిని తాగితే కవలలు పుడతారని ప్రతీతి. దీంతో ఈ గ్రామస్తులేకాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి కొత్తగా పెళ్లయిన జంటల నుంచి, పిల్లలు లేని దంపతుల వరకు ఈ బావి నీటిని తాగుతున్నారు. ఇరవై ఏళ్ల కిందట బండి శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు జనాభా లెక్కలు రాసుకునేందుకు వచ్చి, గ్రామంలో ఇంతమంది కవలలు ఉన్నారేంటని ఆశ్చర్యపోయారు. ఆ బావి నీటి వల్లే కవలలు పుట్టారంటూ గ్రామస్తులు తెలిపారు. అయితే ఉపాధ్యాయుడు ఆ మాటలను నమ్మలేదు. కొంతకాలం తర్వాత ఆ ఉపాధ్యాయుడు అదే గ్రామానికి బదిలీపై వచ్చారు. అప్పటికే వారికి బాబు ఉండగా, ఆ బావి నీరు ఆ దంపతులు తాగడంతో ఇద్దరు కవల ఆడపిల్లలు పుట్టారని, అప్పటి నుంచి ఇది బాగా ప్రాచుర్యంలోకి వచ్చినట్టు దొడ్డిగుంట గ్రామస్తులు తెలిపారు. ఏదిఏమైనా ఆ గ్రామంలో అంతమంది కవలలు ఉండడం విశేషమే కదా మరి. - రంగంపేట





అరె..టేనా!

ఓను.. అందానికే..తినడానికి పనికిరాదు

అబ్బురపరుస్తున్న ఇండోనేషియా రకం

అరెటేనా..ఇంకేమైనానా..ఏంటిది..ఇంత గెల.. సాధ్యమా..అని ఆశ్చర్యపోతున్నారా..! సాధ్యమే.. ఈ అరటి గెల ఎక్కడ ఉందో చూడాలంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద సంఘమేశ్వరం వెళ్లే రోడ్డులో ఉన్న సాయి రాఘవేంద్రనర్సరీకి వెళ్లాల్సిందే.. ఆ నర్సరీ రైతు మార్ని సత్యనారాయణరావు ఇండోనేషియా దేశానికి చెందిన అరటిని సాగుచేస్తున్నారు.దీనిపేరు థౌజండ్ ఫింగర్స్.ఈ అరటిగెల కనిపించడానికి భారీగానే కనిపిస్తుంది కానీ తినేందుకు పనికిరాదండోయ్.. అందంగా పెంచుకోవాల్సిందే..ఆ గెలను చూస్తూ ఆనందించాల్సిందే.. ఈ చెట్టు గెలకాసేందుకు 11 నెలల సమయం పడుతుంది.గెల మొత్తం పూర్తవ్వడానికి నాలుగు నెలలు పడుతుందని ఆయన చెప్పారు.నర్సరీలో వేసిన అరటి గెల పొడవు మూడు మీటర్లు, గెల చుట్టు కొలత అరమీటరు ఉందని తెలిపారు. ఈ గెలను విదేశాల్లో పెళ్లిళ్లకు అందకోసం వాడతారని ఇదేగెల ఇండోనేషియాలో రూ.15వేలు వరకు ధర ఉంటుందన్నారు.నేలపై కూడా గెల వేసి అబ్బురపరుస్తున్న అందరినీ అబ్బుర పరుస్తుంది. - మండపేట

9 నుంచి నరసన్న కల్యాణోత్సవాలు

కోరుకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు వచ్చే నెల 9వ తేదీ నుంచి ఆరంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ. ప్రతి ఏడాది సుమారు లక్ష మంది వరకు భక్తులు రథోత్సవంలో పాల్గొంటారు. స్వామి వారి రథంపై అరటి పండ్లు వేయడం ఇక్కడ సంప్రదాయం. పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మి నరసింహభట్టర్, పెద్దింటి, పెరవలి, పెదపాటి అను వంశక అర్చకస్వాములు వేద మంత్రోచ్చరణల మధ్య గ్రామస్తులు స్వామి వారి అతిపెద్ద రథాన్ని రథశాల నుంచి బయటకు తీశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.ఆర్ అండ్‌బీ,పోలీసు,అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు సూచనల మేరకు రథానికి మరమ్మతులను చేపడుతున్నారు.రథాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఆర్ అండ్‌బీ అధికారులు రథం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసిన తరువాత రథాన్ని వినియోగిస్తారు.రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ రథాన్ని పరిశీలించారు.



కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ విజయవంతంగా ముందుకు సాగుతోంది. ప్రతి మ్యాచ్ హోరాహోరీగా జరుగుతోంది. శుక్రవారం జరిగిన అన్ని మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 8 మ్యాచ్‌లు జరిగాయి. హాకీ టోర్నమెంట్ కన్వీనర్ రాజ్‌కుమార్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

సై



హోరాహోరీగా హాకీ పోటీలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 15-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మహిళా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 22-0 తేడాతో విజయం సాధించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 6-2 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ కాన్పూర్, ఆర్ఎస్బీ జైపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కాన్పూర్ 4-2 తేడాతో గెలిచింది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ కొచ్చి, ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కొచ్చి 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ భువనేశ్వర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 5-0 తేడాతో విజయం సాధించింది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం



వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాం

షాన్‌మోహన్, కాకినాడ జిల్లా కలెక్టర్



హాకీ టోర్నమెంట్ నిర్వహణ అంతా సంతృప్తికరంగా సాగింది. కాకినాడ వేదికగా మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్లు జరగాలి. మొట్టమొదటి సారిగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వచ్చి పాల్గొన్నారు. పూర్తిస్థాయిలో విజయవంతమయ్యాం. మన జాతీయ క్రీడ హాకీ కోసం క్రీడాకారులను ఈ టోర్నమెంట్ ద్వారా ముందుకు తీసుకెళ్లాం. అసోసియేషన్ మెంబర్స్‌తో మరెన్నో టోర్నమెంట్లు నిర్వహించుకోవడానికి సిద్ధపడతాం.

స్థానిక యువత తిలకించేందుకు రావాలి

మల్లిబాబు, ఆర్డీవో



జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్ కాకినాడ వేదికగా జరుగుతోంది. మ్యాచ్‌లు చూడడానికి స్థానిక యువత, ప్రజలు ఆసక్తి కనబరచాలి. క్రికెట్‌కు ఉన్న క్రేజ్ హాకీకి లేకపోవడంతో తిలకించేందుకు ఎవరూ రాకపోవడం బాధాకరం. ఫైనల్ మ్యాచ్ అయినా తిలకించేందుకు స్థానిక యువత రావాలి. కలెక్టర్ షాన్‌మోహన్ ఎక్కడా రాజీపడకుండా ఏర్పాట్లు చేశారు.

స్నేహపూర్వక వాతావరణం కోసం క్యాంప్ ఫైర్

వి.రవిరాజు, టోర్నమెంట్ కోఆర్డినేటర్,



సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్ మొట్టమొదటిసారి మన కాకినాడలో జరగడం చాలా సంతోషం. కలెక్టర్ షాన్‌మోహన్ కృషితోనే ఇదంతా సాధ్యమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరం కోసమే ఈ క్యాంఫైర్ ఏర్పాట్లు. 2028లో నిర్వహించనున్న అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌కు కాకినాడ వేదిక కావాలని ఆశిస్తున్నాను. ఈ టోర్నమెంట్‌కి 15మంది టెక్నికల్ అఫీషియల్స్‌ను, 30మంది పీడీలను ఆంధ్రప్రదేశ్ నుంచి రిక్రూట్ చేసుకుని మ్యాచ్‌లు నిర్వహిస్తున్నాం.

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి)



ఉల్లాసంగా..

జిల్లా క్రీడా మైదానంలో క్యాంప్ ఫైర్.. క్రీడాకారుల నృత్యాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన క్యాంప్ ఫైర్ ఉత్సాహంగా సాగింది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, వివిధ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు.



ఆహా..ఏమి రుచి

క్రీడాకారులకు పసందైన విందు



కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ సందర్భంగా శుక్రవారం క్రీడాకారులకు పసందైన విందు ఏర్పాటు చేశారు. శాకాహార, మాంసాహార వంటకాలను సిద్ధం చేశారు. ప్రముఖ చెఫ్ టి.బాలాజీ సారథ్యంలో ఘుమఘుమలాడే వంటకాలు తయారు చేశారు. చిట్టిముత్యాల బిర్యానీ, రొయ్యలు ఫ్రై, రొయ్యల కర్రీ, చేప పులుసు, నెత్తళ్ల ఫ్రై, అపోలో ఫిష్ లాంటి నాన్‌వెజ్ రకాలతో పాటు పన్నీర్ బటర్ మసాలా, బంగాళదుంప మిల్‌మేకర్ కర్రీ, బూందీ ములక్కాడ జీడిపప్పు కర్రీ, పప్పు మామిడికాయ కర్రీ, బీట్‌రూట్ రసం, సాంబారు లాంటి వెజ్ కర్రీలు..చిల్లీ మంచూరియా, మష్రూమ్ జీడిపప్పు, వెజ్‌ఫింగ్ రోల్స్, పీనట్ మసాలా, తందూరి రోటీ వడ్డించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులతో పాటు ఇతర అధికారులు, క్రీడాకారులు విందుకు హాజరయ్యారు.

వాహనదారులు అలెర్ట్



మోటారు వాహన చట్టంలోని నిబంధనలు పక్కాగా అమలు చేసే దిశగా పోలీసు, రవాణాశాఖలు అడుగులు వేయబోతున్నాయి. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. హెల్మెట్, సీటుబెల్ట్‌లు తప్పనిసరిగా ధరించేలా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. లేదంటే భారీస్థాయిలో జరిమానాలు, శిక్షలు విధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే
- మార్చి 1 నుంచి కఠినంగా అమలు
- ఉల్లంఘిస్తే జరిమానాలు, కేసులు

సామర్లకోట, ఆంధ్రజ్యోతి:
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇకపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతామంటే కుదరదు. హెల్మెట్ తప్పనిసరి. ఆపై అన్నిరకాల ధృవపత్రాలు ఉండాలి. నిబంధనలు పాటించాలి. లేకుంటే భారీ జరిమానాలు చెల్లించక తప్పదు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం(హైకోర్టు) ఆదేశాల మేరకు మార్చి 1 నుంచి ప్రభుత్వం గట్టిగానే చర్యలకు దిగనుంది. మోటారు వాహన చట్టాలను మరింత కఠినంగా అమలు చేసేందుకు రవాణా, పోలీసు శాఖలు సిద్ధమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాల మోత మోగించనున్నారు. చట్టాన్ని పట్టించుకోకపోతే లైసెన్స్‌లనూ రద్దు చేసేందుకు వెనకాడరు. ఇందుకు సంబంధించి పోలీసుశాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ప్రతి వాహనదారుడి వివరాలు అందులో ఉంటాయి. గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినవారు, చలానా కట్టనివారి వివరాలు అన్నీ అందుబాటులోకి వస్తాయి. దానికి అనుగుణంగా జరిమానాలు విధిస్తారు. ఈ నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండి నిబంధనలు పాటించాలి.



ప్రజల్లో మార్పు కోసమే..

రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా వాహనదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. మార్చి 1 నుంచి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. గ్రామీణ ప్రాంతాలనుంచి ఓవర్‌లోడ్‌తో ఆటోలు ఏడీబీ రోడ్డు, కెనాల్‌రోడ్డు, పెద్దాపురం, పిఠాపురం రోడ్డుమీదుగా సామర్లకోట పట్టణంలోకి వస్తున్నాయి. దీనివల్ల రోడ్డుప్రమాదాల్లో గాయ పడిన వారి సంఖ్య పెరుగుతుంది. దీన్ని నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇకపై నిబంధనలు కఠినంగా అమలుచేస్తాం. మూడుకంటే ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి లైసెన్స్‌లు రద్దుకు సిఫార్సు చేస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తులకు నెల రోజులపాటు శిక్షలు పడే అవకాశం ఉంది.

-అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్ఐ, సామర్లకోట

ఇప్పటి వరకూ అలా.. 1 నుంచి ఇలా..

హెల్మెట్ లేకుండా ప్రయాణానికి ఇప్పటివరకూ రూ.135 జరిమానా వేసేవారు. ఇకనుంచి రూ.1000 కట్టాల్సిందే. లైసెన్స్ లేకుండా బండి నడిపితే రూ.10వేలు వసూలు చేస్తారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగితే కేసులు నమోదు చేస్తారు. 90 రోజుల్లో జరిమానా చెల్లించకపోతే వాహనాన్ని సీజ్ చేస్తారు. వెనుక కూర్చునవారు హెల్మెట్ ధరించకపోతే రూ.1000 జరిమానా, వాహనానికి ఇన్సూరెన్స్ లేకుంటే రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.2000, భారీ సైలెన్సర్లతో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే రూ.2000, అదే రెండోసారి దొరికితే రూ.4000, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించుకుంటే మనిషికి రూ.200 చొప్పున జరిమానా విధిస్తారు. మైనర్లు డ్రైవ్ చేస్తే రూ.1000, నిషేధం ఉన్న ప్రాంతాలో పార్కింగ్ చేస్తే రూ.1000 నుంచి రూ.2000, బైక్ రేసుల్లో పాల్గొంటే రూ.5000, అందులో దొరికితే రూ.10వేలు, తాగి వాహనం నడిపితే మూడు నెలలు జైలుశిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధిస్తారు. దీన్ని అమలు చేసేందుకు పోలీసు, రవాణా శాఖలు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాయి.

కళాశాలల్లో ఫేర్‌వెల్ పార్టీలు నిషేధించండి

- ఏ కార్యక్రమమైనా సంప్రదాయబద్ధంగా ఉండాలి
- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ఫంక్షన్లు, ఫేర్‌వెల్ పార్టీలు, డీజెలు వంటి నృత్య ప్రదర్శనలు నిషేధించాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆదేశించారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు శుక్రవారం నన్నయ వర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించేందుకే కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. కళాశాలలు ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలు నన్నయ వర్సిటీలో ఉన్నాయన్నారు. 390 అనుబంధ కళాశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అన్ని కళాశాలల్లో పరీక్షలు సక్రమంగా జరిగేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా మోనటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దాన్ని విశ్వవిద్యాలయం నుంచి అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. దీనిద్వారా ఆయా కళాశాలల్లో పరీక్ష నిర్వహణ, పర్యవేక్షణ సులభతరం అవుతుందని అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలను సందర్శించేందుకు అయ్యే ఖర్చు, సమయం కలిసి వస్తాయన్నారు. వీటిని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆయాకళాశాలలపై ఉందన్నారు. దీనిపై కళాశాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.అర్హులైన అధ్యాపకులతో పూర్తిస్థాయిలో అన్నికళాశాలల్లో తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి పాల్గొన్నారు.



కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

యువతిని వంచించిన వ్యక్తికి పదేళ్ల జైలు

ఐ.పోలవరం,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచించిన వ్యక్తికి కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధించింది. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో పశువుల్లంక సచివాలయంలో వాలంటీర్‌గా పనిచేస్తున్న యువతితో అక్కడే వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాళ్లరేవు మండలం చిన్నగోవలంకకు చెందిన కాశి మధుబాబు ప్రేమ వ్యవహారం నడిపాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచించాడు. బాధితురాలు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ సీహెచ్ రాజేష్ కేసు నమోదుచేయగా అప్పటి సీఐ జానకీరామ్ నిందితుడిని అరెస్టు చేశారు. వాదోపవాదనల తర్వాత నేరం రుజువుకావడంతో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం మహిళాకోర్టు జడ్జి బెన్నయ్యనాయుడు శుక్రవారం తీర్పుచెప్పినట్టు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



ఆటోడ్రైవర్ రామకృష్ణ ను సన్మానిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

- ప్రయాణికురాలు మర్చిపోయిన నగల బ్యాగ్ పోలీసులకు అందజేత
- సత్కరించిన పోలీసులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆటోలో వదిలివేసిన 10 కాసుల బంగారు నగలతో ఉన్న బ్యాగ్‌ను ఓ ఆటోడ్రైవర్ పోలీసులకు అప్పగించాడు. అతడి నిజాయితీకి ఫిదా అయిన కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అతడ్ని సన్మానించి సత్కరించారు.

కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన ఊరసుధ తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం కాకినాడలోని బంధువుల వివాహానికి హాజరై శుక్రవారం తిరిగి అన్నవరం వెళ్లేందుకుగాను సర్పవరంలో దిగి ఆటోలో నగలతో ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయింది. అనంతరం ఆటోలో బ్యాగ్ మరిచిపోయిన విషయాన్ని గ్రహించి సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆటోను పెదపూడిలో గుర్తించి అక్కడి ఎస్ఐకు సమాచారం అందించారు. పెదపూడి ఎస్ఐ తన సిబ్బందితో ఆటో గురించి వెతుకుతున్న తరుణంలో ఆటోడ్రైవర్ ఎర్రంశెట్టి రామకృష్ణ తమ ఆటోలో వదిలివేసిన బ్యాగ్‌ను గుర్తించి పెదపూడి ఎస్ఐ రామారావుకు అందజేశాడు. అనంతరం నగలతో ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని సుధకు ఎస్పీ ద్వారా అందజేశారు. ఆమె పోలీసులకు, ఆటో డ్రైవర్ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపింది.

ఇంటి బయటపెట్టిన బైక్ దగ్ధం



కాకినాడలో దగ్ధమవుతున్న మోటారుసైకిల్

- తెల్లవారు జామున తగులబెట్టిన అగంతకులు
- పాతకక్షల నేపథ్యంలో జరిగి ఉండొచ్చని అంచనా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఇంటి బయటపెట్టిన మోటారుబైక్‌ను కొంతమంది అగంతకులు తగులపెట్టిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున కాకినాడలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పాతబస్టాండ్ టీబీ ఆస్పత్రి వెనుక వీధిలో పెమ్మాడి అజయ్‌కుమార్ తన పల్సర్-150 మోటారుబైక్‌ను అతడి ఇంటి బయట పార్క్ చేసి నిద్రించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో అగంతకులు మోటారుబైక్‌ను ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టి తగులపెట్టారు. వాహన యజమాని, స్థానికులు గమనించేసరికి బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనకు కారణం 3 నెలల క్రితం స్థానికుడైన ధాలీ హత్యోదంతానికి ప్రతీకార చర్య అని స్థానికులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో గంజాయి సేవించిన ఆకతాయిలు తమను భయాందోళనలకు గురిచేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పంట బోదెలోకి దూసుకెళ్లి వ్యక్తి మృతి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌ను అతివేగంగా నడపడంతో పంటబోదెలోకి దూసుకుపోయి రాయిని ఢీకొట్టిన ఘటనలో బైక్ వెనుక కూర్చొన్న గొలకోటి రమేష్(45) అక్కడికక్కడే మృతిచెందినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు శుక్రవారం తెలిపారు. కొత్తపేట మండలం కండ్రి గ్రామ శివారు ఆర్లపల్లివారిపాలేనికి చెందిన రమేష్ తాపీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. తన తోడల్లుడైన గునిశెట్టి సోమసుందరశేఖర్‌తో కలిసి మోటారుసైకిల్‌పై రాజోలు నుంచి అత్తవారి గ్రామమైన ఉప్పలగుప్తం బయలుదేరారు. మార్గమధ్యలో కామనగరువులోని రాజులపూడి భాస్కరరావు ఇంటి ప్రాంతానికి వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకుపోయింది. రమేష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మోటారుసైకిల్ నడుపుతున్న శేఖర్‌కు గాయాలు కావడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శవమై తేలాడు

అదృశ్యమైన యువకుడి మృతదేహం గోదావరిలో లభ్యం



గగ్గులోతు సాయితేజ(ఫైల్)

కొవ్వూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గోదావరినదిలో దూకి గల్లంతైన యువకుడి మృతదేహన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. తూర్పుగోదావరిజిల్లా ఔరంగాబాద్ ఇసుకర్యాంపు సమీపంలో గురువారం రాత్రి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈనెల 19న రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గులోతుసాయితేజ(25) అదృశ్యమయ్యాడు. గోదావరిలో మృతదేహం లభ్యం కావడంతో సాయితేజది అని నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసును మార్పు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.

కొట్టేసిన చోటే కుదువ పెట్టి..

- కెనరా బ్యాంకులో ఘరానా మోసం
- గోల్డ్ అప్రైజర్ చేతివాటం
- ఖాతాదారుల ఆందోళన



కుదువ పెట్టిన బంగారం కోసం పడిగాపులు కాస్తున్న ఖాతాదారులు

తుని రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తేటగుంట కెనరా బ్యాంకులో బంగారం గోల్‌మాల్ సంచలనం రేకెత్తించింది. గోల్డ్ అప్రైజర్ చేతివాటంతో 150కి పైబడి ఖాతాదారుల బ్యాంకులో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు మాయం కావడంతో ఖాతాదారులు కంగుతిన్నారు. దీంతో పెద్దఎత్తున ఖాతాదారులు బ్యాంకువద్ద ఆందోళనకు దిగగా బ్యాంకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి వారికి సర్ది చెప్పే పనిలోపడ్డారు. విచారణ చేపట్టిన అధికారులు ఇంటి దొంగల పనిగా తేల్చేశారు. అదే బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న మేనేజర్‌తోపాటు అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. అక్రమాల్లో సూత్రధారిగా ఉన్న గోల్డ్ అప్రైజర్‌పై తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆశ్చర్యపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతమైన తేటగుంటలో ఏర్పాటు అయిన కెనరా బ్యాంకులో సగానికి మించి ఖాతాదారులు రైతు కుటుంబీకులే. ఇదే అదునుగా భావించి గోల్డ్ అప్రైజర్ ఏడాదికొకసారి గోల్డ్‌లోన్ రెన్యువల్ చేసే క్రమంలో సంబంధిత ఖాతాదారుడి గోల్డ్ ప్యాకెట్‌నుంచి ఒకటి రెండు బంగారు ఆభరణాలు కాజేసి అదే బ్యాంకులో తన కుటుంబసభ్యుల ఖాతాల పేరిట కుదువ పెట్టి కాసులు కొల్ల కొట్టినట్లు విచారణలో బయటపడింది. గోల్డ్ గోల్‌మాల్ జరిగిందన్న సమాచారంతో పెద్దఎత్తున బంగారం కుదువ పెట్టిన ఖాతాదారులు ఆందోళనకు దిగారు. వారి బంగారానికి బ్యాంకే గ్యారెంటీ అని అధికారులు చెప్తున్నా బ్యాంకు బయట వారంతా ఆందోళనకు దిగుతున్నారు.

పాఠశాలలో ఇన్‌ట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్ చోరీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో ఎంపీపీయుపీ ఉన్నత పాఠశాలలో ఇన్‌ట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలను శుక్రవారం తెరిచేసరికి ఐపీఎఫ్ చోరీకి గురయినట్లు గుర్తించారు. హెచ్ఎం బొలిశెట్టి లక్ష్మణరావు ద్రాక్షారామ పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించారు. రూ.లక్ష వరకు ఖరీదు చేసే ఐపీఎఫ్‌ను ఈనెల 10న చోరీ చేసేందుకు దొంగలు యత్నించారు. కటకటాల్లో ఇరుక్కుపోవడంతో వదిలిపోయారు. దీనిపై అప్పట్లో హెచ్ఎం ఫిర్యాదు చేశారు. దొంగలు మరోసారి ప్రయత్నించి చోరీ చేశారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

కోటనందూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కె.కొట్టాంలో మురుగుడు కాలువవద్ద శుక్రవారం ఉపాధి పనుల వద్ద తేనెటీగలు దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కూలీలు పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో పండుగ రాజు, పండుగ అప్పారావు, సలాది నాగరత్నం, కోనాల సింహాచలం, గుడాల గొంతెమ్మ, కడితి నిర్మలకుమారికి గాయాలయ్యాయి. వీరిని కోటనందూరు పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యంకోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాశీవిశ్వనాథం మృతి.. బ్యాడ్మింటన్‌కు తీరని లోటు



కాశీవిశ్వనాథం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

- షటిల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్
- సాత్విక్ సాయిరాజ్‌కు పలువురి పరామర్శ

అమలాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీనియర్ వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం మృతి రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్‌కు తీరని లోటని షటిల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. తానొక మంచి ఆత్మీయుడిని కోల్పోయానన్నారు. గుండెపోటుతో కాశీవిశ్వనాథం మృతిచెందడంతో ఎంతో బాధను కలిగించిందన్నారు. శుక్రవారం అమలాపురం గాంధీబజార్‌లోని కాశీ స్వగృహం వద్దకు అంతర్జాతీయ క్రీడాకారులతో కలిసి వచ్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తన శిష్యుడైన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్‌ను ఆయన ఓదార్చారు. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకమైన ధ్యానచంద్ ఖేల్‌రత్న అవార్డును అందుకోవాల్సిన సాత్విక్ తండ్రి కాశీ మృతి సమాచారంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని రాత్రికి అమలాపురం చేరుకున్నారు. గోపీచంద్‌తోపాటు సాత్విక్ జోడి అయిన చిరాగ్‌శెట్టి, మరో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, వెటరన్ క్రీడాకారుడు ఏవీఎస్ఎన్ మూర్తి, ఆకుల సునీల్, ఆకుల బాలాజీ తదితరులు కాశీ భౌతికకాయానికి నివాళులర్పించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాత్విక్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. సాత్విక్‌కు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులతోపాటు జవ్వాది తాతబాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పాయసం శ్రీనివాస్ పాల్గొని నివాళులర్పించారు. జాతీయ బ్యాడ్మింటన్ రిఫరీ అయిన కాశీ మరణం క్రీడారంగానికి తీరని లోటని మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు అన్నారు. మరణ వార్త తెలిసిన వెంటనే ఫోన్‌లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాశీ తనకు మంచి మిత్రుడని, ఎంపీగా పనిచేసిన సమయంలో కాశీ ద్వారా క్రీడాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

మండపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన వ్యక్తి గతేడాది రెండు మోటారుసైకిళ్లను దొంగిలించిన కేసు రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష పడిందని మండపేట పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట పట్టణం రథంవీధికి చెందిన మేకాశివశ్యామ్ గతేడాది సెప్టెంబరు 24న రెండు బైక్‌లు చోరీ చేసినట్టు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఆలమూరు మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి నాగేశ్వరనాయక్ నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధించారని ఎస్ఐ శాస్త్రి తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

మండపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో పదో తరగతి బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో నిందితుడిని ఈనెల20న అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ దారం సురేష్ తెలిపారు. ఈనెల 17న బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైందని ఆయన చెప్పారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి ముప్పిడి క్రాంతికుమార్‌ను గురువారం అరెస్టు చేసి ఆలమూరు కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల పాటు రిమాండ్ విధించారని తెలిపారు.

బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న బాలుడి అరెస్ట్

రూ.2.80లక్షల విలువైన ఆరు బైక్‌లు స్వాధీనం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో బైక్ చోరీలకు పాల్పడుతున్న బాలుడ్ని ఇంద్రపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రూ.2.80 లక్షలు విలువ చేసే ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పలుప్రాంతాల్లో జరుగుతున్న చైన్‌స్నాచింగ్, చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకునే చర్యల్లోభాగంగా శుక్రవారం ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి చీడిగ ఫ్లైఓవర్ బ్రిడ్జివద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై నుంచి పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలుడు కాకినాడ వైపు వస్తోండగా బైక్ ఆపి తనిఖీ నిర్వహించారు. అనుమానంతో విచారించగా బైక్‌ల చోరీలకు పాల్పడిన విషయం బయటపడింది. ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్, సామర్లకోట పీఎస్‌లో మూడు బైక్‌లు, కోరింగ, సర్పవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు బైక్‌లు వెరసి ఆరు బైక్‌లను నిందితుడినుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు. వీటి విలువ రూ.2.80లక్షలు ఉంటుందన్నారు. నిందితుడుపై ఉన్న పలు కేసుల్లో చేసిన నేరాలకుగాను డిస్ట్రిక్ట్ ప్రొబిషనరీ ఆఫీసర్ ముందు హాజరు పరిచామన్నారు. నిందితుడ్ని పట్టుకుని చోరీసొత్తు రికవరీ చేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

బియ్యం పంపిణీలో తూకం కచ్చితంగా ఉండాలి

ఆర్డీవో కృష్ణనాయక్. ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ



ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎంఎల్ఎస్ పాయింట్స్ నుంచి బియ్యం ప్రజా పంపిణీ కోసం సరఫరా చేస్తున్న దృష్ట్యా తూకం కచ్చితంగా వుండేలా చూసుకోవాలని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ స్పష్టంచేశారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పౌర సరఫరాల ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేసారు. ఈ సందర్భంగా బియ్యం స్టాక్‌కు సంబంధించి ప్రతి బస్తా 50 కిలోల గన్నీ బ్యాగ్ బరువు కాకుండా వుండాలన్నారు. పరిశీలనలో కొన్ని బియ్యం బస్తాల బరువు 50 కిలోలు, మరికొన్ని 48.800 కిలోలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు పంపిణీ చేసే విధానంలో గన్నీ బ్యాగ్ బరువు కా కుండా 50 కేజీలు వుండాలన్నారు. బఫర్ స్టాక్ గొడౌను నుంచి తీసుకొచ్చే సందర్భంలోనే సరి చూచుకొనే బాధ్యత పాయింట్ ఇన్‌చార్జిదే అన్నారు. లోడు మొత్తం బరువును బట్టి స్టాక్ నమోదు చేస్తారని అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంఎస్ఎల్ కుమార్, పాయింట్ ఇన్‌చార్జి డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండో రోజు ఉద్భవ్ యువజనోత్సవాలు

కళాశాల విద్యార్థుల మధ్యనే పోటీలు, ఈవెంట్లు



ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం వద్ద వెలవెలబోతున్న స్టాల్స్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉద్భవ్-2025 పేరుతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మూడు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ యువజనోత్సవాలు రెండో రోజైన శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా జరిగిన పలు ఈవెంట్లలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే యువజనోత్సవాలకు పార్టిసిపెంట్స్ నుంచి ఆదరణ కరువైంది. కళాశాల వేదికగా జాతీయ యువజనోత్సవాల పేరుతో వీటిని నిర్వహిస్తున్నా ఇతర జిల్లాల నుంచి కానీ, రాష్ట్రాల నుంచి కానీ ఎలాంటి ప్రాతినిధ్యం కనిపించడంలేదు. ఇతర జిల్లాల్లోని కళాశాలల ఫ్యాకల్టీ, విద్యార్థుల తోపాటు చివరకు రాజమహేంద్రవరం సిటీలోని కళాశాలల నుంచి కూడా విద్యార్థులు పాల్గొనకపోవడం గమనార్హం. ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం వద్ద విద్యార్థులు, ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు ఆదరణ కనిపించలేదు. మొదటి, రెండు రోజులు కళాశాల విద్యార్థులే ఆయా ఈవెంట్లలో పాల్గొన్నారు. చివరి రోజైన శనివారం జరిగే ఈవెంట్లకు ఇతర జిల్లాల నుంచి పార్టిసిపెంట్స్ రానున్నారని నిర్వహణ ప్రతినిధులు చెబుతున్నా, ఏయే జిల్లాల నుంచి ఎంతమంది వస్తారనే లెక్కలు కూడా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

డ్రోన్ కెమెరాలతో రేవుల పర్యవేక్షణ

గోదావరి స్నానాల రేవుల పరిశీలనలో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్



పుష్కరాల రేవు ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్ల పర్యవేక్షణ డ్రోన్ కెమెరాలతో నిర్వహిస్తామని రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం రాత్రి గోదావరి స్నానాల రేవులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రేవుల్లో జరిగే కార్యక్రమాలను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించాలని అందుకు తగినన్ని డ్రోన్ కెమెరాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పాలిచ్చే తల్లులకు విడిగా సెంటర్లు ఏర్పాటు చేయాలని, రేవుల్లో అన్ని శాఖల సిబ్బందితో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు జనసందోహాన్ని అదుపు చేయాలని అధికారులను ఆదేశించారు. స్త్రీలు, పురుషులు విడివిడిగా స్నానాలు చేసేలా ఏర్పాట్లు చేయాలని మహిళలు దుస్తులు మార్చుకునే గదులు వద్ద మహిళా పోలీసులను నియమించాలన్నారు. నగరంలో ట్రాఫిక్ విషయంలో సమన్వయంతో సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రామలింగేశ్వర్, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సత్యనారాయణరాజు, ఈఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, రామలింగారెడ్డి, డీఈఈ విరూపాక్షరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై గౌరవం ఉంటే జగన్ అసెంబ్లీకి రావాలి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం ఉన్నా పులివెందల ఎమ్మెల్యే జగన్ రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు రావాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాల్సిన జగన్ రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏ సభ్యుడైన స్పీకర్ అనుమతి లేకుండా 90 రోజుల పాటు అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు తప్పదని దానికి రాజ్యాంగంలో ఆర్టికల్ ఉందని ఇలా నలుగురు సభ్యులు అనర్హతకు గురయ్యారని గుర్తు చేశారు. అధికార మదంతో ఐదేళ్లు జగన్ వ్యవస్థలను నాశనం చేశారన్నారు. జగన్ లాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదనే ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించి ఇంట్లో కూర్చోబెట్టారని విమర్శించారు. రాష్ట్రానికి ఆదాయం తెచ్చేశాఖలను ఐదేళ్లపాటు తాళం వేసిన వ్యక్తి ఇప్పుడు వాటి గురించి మాటలాడడం విచిత్రంగా ఉందని ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకు అండగా ఉంటాం

రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ లావణ్య



పంటలను పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి లావణ్య

కడియం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విజయవాడ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ ఎస్.లావణ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్ మండలంలోని దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం, మురమండ గ్రామాల్లో పర్యటించారు. టమాట, క్యాబేజీ, మిర్చి, కూర అరటి తదితర కూరగాయలు పండించే పొలాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి పంట దిగుబడిపై ఆరా తీశారు. రైతులకు నష్టం కలుగకుండా, గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెటింగ్ శాఖ అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. అలానే టమాట, క్యాబేజీ పంటలను ప్రొక్యూర్ చేసి స్థానిక రైతుబజార్‌లో అమ్మించాలని ప్రొక్యూర్‌మెంట్ సభ్యులైన ఈవోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోలు శ్రీనివాసరావు, తేజ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిస్తే సమాజానికి మేలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : మొక్కలునాటి సంరక్షించడం సమాజం సమిష్టి బాధ్యత అని వినయ్ సుంకరఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. వడిశలేరులో మగ్గం వర్క్ శిక్షణను పూర్తిచేసుకున్న60 మంది మహిళలకు స్థానికంగా ఉన్న ఫౌండేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంపకం పట్ల నిర్లక్ష్యం వహిస్తే కొంత కాలానికి ఆక్సిజన్ లభించని పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. నేర్చుకున్న శిక్షణను అభ్యాసం చేస్తూ ఆదాయాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్‌ట్రస్టీ సుంకరనాగేశ్వరరావు. సభ్యులు ప్రదీప్, వినీల, మీనా, సింధు, మణిలక్ష్మితదితరులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌లో లక్ష ఫెలోషిప్‌లు

రాజానగరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం క్రింద బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఒక లక్ష ఫెలోషిప్‌లను వివిధ పరిశ్రమల్లో ప్రభుత్వం అందజేయనున్నదని విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ దండు రాధా ప్రసాదరాజు అన్నారు. జీజీయూ, గైట్ అటానమస్ కళాశాలలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ నిర్వహణలో విద్యార్థులకు, అధ్యాపకులకు శుక్రవారం వేర్వేరు అంశాలపై నిపుణులచర్య కార్యక్రమం ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ అధ్యక్షతన జరిగింది. వర్ధమాన వ్యవస్థాపకుల కోసం సామర్థ్య నిర్వహణ చొరవలు అనే అంశంపై విద్యార్థులకు జరిగిన సమావేశంలో రీసోర్స్‌పర్సన్‌గా హాజరైన ప్రసాదరాజు ఈఫెలోషిప్‌లకు దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశోధనలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందుకోసం ఈ ఏడాది రూ.11,200 కోట్లు కేటాయించనుందని అన్నారు. సమావేశంలో సీఏవో కేవీబీ రాజు, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీప్రసాద్, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పిడింగొయ్యిలో ఉచిత వైద్యశిబిరం

రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడింగొయ్యి పంచాయతీ పరిధి బాపూజీనగర్‌లో సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎముకల సుమారు 320 మందికి సాంద్రత పరీక్షలు, కంటి పరీక్షలు, బీపీ, షుగర్, జనరల్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

- 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ
- పలుచోట్ల అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం
- విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు.. ర్యాలీలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) మాతృభాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల నిర్వహించారు. నన్నయ వర్సిటీలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగం, తెలుగుశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అమ్మను ప్రేమించినట్లే అమ్మభాషను ప్రేమించాలన్నారు తద్వారా భాష ప్రవాహశీలంగా భావితరాలకు అందుతుందన్నారు. మాతృభాషపై పాశ్చాత్యభాషల ప్రభావం ఉంటుందని అయినప్పటికీ అమ్మభాషను రక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఆంగ్లశాఖ విభాగాధిపతి ఎస్.సజన్‌రాజ్, తెలుగు శాఖాధిపతి దొంతరాజు లక్ష్మీనరసమ్మ, నండూరి కృష్ణమాచార్యులు బంధువు, నండూరి జయలక్ష్మి పాల్గొన్నారు. కాగా మాతృభాషా దినోత్సవం సందర్భంగా రోటరీ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో వీసీ ప్రసన్నశ్రీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంధి రాజా, నీరుకొండ వీరన్నచౌదరి, పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి నన్నయ వర్సిటీ తెలుగుశాఖ సహాయాచార్యులు తలారి వాసు విచ్చేసి మాట్లాడారు. మాతృభాష ఎంతో గొప్పదని, భాషను అభిమానించడం ద్వారా సాహిత్య పరిచయం కలుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ బీవీ జనార్దనరావు మాట్లాడుతూ తెలుగుభాషలో అమృతనం, ప్రేమ, ఆప్యాయత, మమతానురాగాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వై.వెంకట్, కార్యక్రమ సమన్వయకర్త కె.వీరబ్బాయి పాల్గొన్నారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ మాతృమూర్తిని, మాతృభాషను ఏనాడు మరువరాదన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. షిరిన్ సిస్టర్ పాడిన తెలుగుపాటలు, విద్యార్థుల తెలుగు సంభాషణలు, పద్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక గోకవరం బస్టాండు సమీపంలోని డాక్టర్ కంటే వీరన్నచౌదరి హాస్పిటల్ ఆవరణలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సాంస్కృతిక మందిరంలో రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాకా సభ్యులు తెలుగు తల్లి చిత్రపటానికి అంజలి ఘటించారు. వీరన్నచౌదరి మాట్లాడుతూ తెలుగుభాష పైన పట్టు నానాటికీ జారుతుందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీఎస్ మూర్తి మాతృభాష ఆవశ్యకతను వివరించారు. సూరపురెడ్డి తాతారావు, భమిడిపాటి మూర్తి, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పరభాషా పదాలను విచ్చలవిడిగా వాడడం, కొత్త పద నిర్మాణంపై ఎక్కువగా కృషి జరగకపోవడం వల్లే తెలుగు భాష కుంటుపడుతుందన్నారు. నన్నయ వర్సిటీ తెలుగు ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ మాతృభాషాభిమానం జనసామాన్యానికి లేదన్నారు. కార్యక్రమంలో పీవీబీ సంజీవరావు, బీహెచ్ రమాదేవి, మరో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎం.శ్రీహరి, ఏపీఎస్‌డీ శ్రీనివాస్, పీపీ సుధ, ఎస్.రాజ్‌కుమార్, జె.సుగుణ పాల్గొన్నారు. స్థానిక సరస్వతీ ఘాట్‌లో సీసీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సన్నిధానం మాట్లాడుతూ మాతృభాష ద్వారా విద్యాబోధన అంశంపై, 2015లోనే యునెస్కో ఓ కార్యాచరణ రూపొందించినా ఆ కార్యాచరణ తెలుగు రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని, న్యాయ స్థానాల్లో తీర్పులు మాతృభాషల్లో రావాలన్నారు. కార్యక్రమంలో సరస్వతీ ఘాట్ కార్యదర్శి తోట సుబ్బారావు, ఎస్ ఎస్‌టీ సరస్వతి, జె.కల్కిమూర్తి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక మునిసిపల్ కాలనీలోని బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.చిట్టిబాబు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచంలో భాషలన్నింటిని రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతుందన్నారు.



రాజమహేంద్రవరంలో తెలుగుతల్లికి అంజలి ఘటిస్తున్న దృశ్యం

కూటమి అభ్యర్థిని గెలిపించండి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మైనార్టీ శాఖా మంత్రి జనాబ్ ఫరూక్



కొంతమూరు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జనాబ్ ఫరూక్

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని రాష్ట్ర మైనార్టీ శాఖా మంత్రి జనాబ్ ఫరూక్ పిలుపునిచ్చారు. మండలంలోని కొంతమూరు గ్రామంలో శుక్రవారం జరిగిన ముస్లిం మైనార్టీల సదస్సుకు ఫరూక్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారిని మైనార్టీ నేత షేక్ సుభాన్ సత్కరించారు. అనంతరం ఆయన అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. పట్టభద్రులైన ఓటర్లు, ఉద్యోగులు రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సయ్యద్ కుమార్, షేక్ సలీం, షేక్ బాబ్జి, షేక్ ఖాసిం, మొకరం హుస్సేన్, సల్మాన్ హుస్సేన్, షేక్ ఇబ్రహీం, కరీం ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పలు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ పర్యటించి గ్రాడ్యుయేట్లను కలసుకుని కరపత్రాలు అందించారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు తొలి ప్రాధాన్య ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. పోలీస్‌స్టేషన్లు, డీఎస్పీ కార్యాలయాలు, డీవైఈవో, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో పట్టభద్రులైన ఓటర్లను టీడీపీ నేత కాశి నవీన్‌కుమార్, కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, వర్రే శ్రీనివాస్, బత్తుల తాతబాబు, బుడ్డిగ రాధా, చాపల చినరాజు, బత్తుల కిరణ్‌బాబు, మరుకుర్తి రవియాదవ్, దాస్యం ప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి



పోషకాహార కిట్స్ అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గర్భిణీలు, పాలిచ్చే తల్లులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని శంభూనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ కేంద్రం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో పౌష్టికాహార కిట్స్‌ను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా పీడీ విజయకుమారి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు ఐరన్, కాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా కిట్స్ అందజేయడం అభినందనీయమన్నారు. ప్రత్యేక వైద్యశిబిరంలో 125 మంది గర్భిణులు, బాలింతలకు, 75 మంది మూడేళ్లలోపు చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించామని చెప్పారు. రామకృష్ణ మిషన్ కేంద్రం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్వామి రఘువీరానంద మహరాజ్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ పథకంలో భాగంగా పోషకాహార కిట్స్ పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ మణికంఠ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి.ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'పీఎం టీబీ ముక్త్'కు మూడు గ్రామాల ఎంపిక

జిల్లా లెప్రసీ ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి డాక్టర్ వసుంధర



ఎస్టీ రాజాపురంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

కోరుకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయతీల పరిశీలనలో భాగంగా జిల్లా వెరిఫికేషన్ బృందం శుక్రవారం మండలంలోని కాపవరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు వైద్య అధికారి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ క్షయ నివారణ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ కోరుకొండ మండలంలో 2023 సంవత్సరానికి కాపవరం, మునగాల, రాజవరం గ్రామాలు టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎంపికయ్యాయన్నారు. 2024 లో ఇవి సిల్వర్ మెడల్స్‌కు ఎంపిక కాగా జంబుపట్నం పంచాయతీ బ్రాంజ్ మెడల్‌కు ఎంపికయిందన్నారు. ఈ క్రమంలో 2024లో చేసిన టీబీ నిర్ధారణ పరీక్షలు, నమోదైన బాధితుల వివరాలు, నిక్షయ్ పోషణ యోజన, పోషకాహార కిట్లు, 2023 ఔట్‌కమ్‌లను ప్రభుత్వ మెడికల్ కాలేజి కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్రబాబు పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు హరిక, జ్ఞానచందర్, చైతన్య, టీబీ సూపర్‌వైజర్ శ్రీని వాస్, అమృత, పార్వతీశం, మౌనిక, శ్రీనివాస్, రాజ్‌కుమార్, కుసుమ, పలువురు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎస్టీరాజాపురం, చంద్రేడు..

రంగంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు క్షయ రహిత గ్రామాలుగా ఎస్టీరాజాపురం, చంద్రేడు ఉన్నా యని జిల్లా అదనపు వైద్యాధికారి ఎన్.వసుంధర, మెడికల్ కళాశాల డాక్టర్ సురేంద్ర అన్నా రు. పీఎం క్షయ ముక్త్ భారత్ అభి యాన్‌లో భాగంగా జిల్లా వెరిఫికేషన్ టీమ్ శుక్రవారం ఎస్టీరాజాపురం, చంద్రేడు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఈ గ్రామాలు సిల్వర్ మెడల్స్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. డీఎన్ఎంవో హరిక మాట్లాడుతూ ఈ గ్రామాలు 2023లో బ్రాంజ్‌మెడల్ సాధించగా, 2024లో సిల్వర్ మెడల్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా 2024లో నమోదు చేసిన క్షయ నిర్ధారణ పరీక్షలు, నమోదైన బాధితుల వివరాలను నిక్షయ పోషణ యోజన పోషకాహార కిట్లు, 2023 సంవత్సరం అవుట్‌కమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్.దినేష్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు బి.వేణుశ్రీలక్ష్మీ, కె.చిన్నారావు, మెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీబీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీబీ ఒక అంటువ్యాధి అని, ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు వైద్యులు పేర్కొన్నారు. టీబీ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట వీటీ హైస్కూల్, సారంగధర మెట్ట యూపీహెచ్‌సీ, ఆనందనగర్ యూపీహెచ్‌సీ, అంబేడ్కర్‌నగర్ యూపీహెచ్‌సీ, మెరకవీధి యూపీహెచ్‌సీల పరిధిలో ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బ్యానర్లు, కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యులు డాక్టర్ నీలిమ, డాక్టర్ మాణిక్యాంబ, హెచ్‌వీలు ఎంఎస్ఎస్ కుమారి, బీఎన్ లక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ కేవీవీ సత్యనారాయణమూర్తి, టీబీ హెచ్‌వీలు కె.శివ, కె.లోవకుమార్, కె.శైలజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

108మందితో అనఘాష్టమి వ్రతాలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ ఘాట్ వద్ద శ్రీ దత్తముక్తి క్షేత్రంలో శుక్రవారం, మాఘ బహుళ అష్టమి సందర్భంగా 108 మంది దంపతులతో ప్రత్యేకంగా అనఘాష్టమి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు బి.నూకరాజు, సుబ్బలక్ష్మి దంపతులు, కె.సీతారాం, మాధవీలత దంపతుల ఆధ్వర్యంలో జరిగాయి. శ్రీజయలక్ష్మీ మాత మాతృమండలి పర్యవేక్షణలో నిర్వహించిన సామూహిక అనఘాష్టమి వ్రతాలకు విశేషంగా భక్తులు విచ్చేసి శ్రీ అనఘాలక్ష్మి సమేత ఆదిగురు దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

విద్యార్థినుల ఇండస్ట్రియల్ విజిట్

అనపర్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా అనపర్తిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పులగుర్తలోని చేనేత పరిశ్రమను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత సొసైటీ ప్రతినిధులు దూది నుంచి వస్త్రాల తయారీ వరకు అన్ని అంశాలపై ను అవగాహన కల్పించారు. అనంతరం సొసైటీలో తయారైన చీరలను విద్యార్థినులు తిలకించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ నాగమణి, సొసైటీ అధ్యక్షుడు భీమరాజు, సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ అశోక్, హైజిన్ హెడికేటర్ బాల శ్రీలక్ష్మి, సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై టీడీపీ శ్రేణులతో బీవీఆర్ సమావేశం

కోరుకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి పలు ప్రజా సమస్యలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలను బీవీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రామాల్లోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు.

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

బిక్కవోలు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో స్నాక్స్ పంపిణీ చేశారు. 120 మంది విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేసినట్టు హెచ్ఎం చర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎస్ఎంసీ సభ్యులు వీరభద్రం, ఉపాధ్యాయులు జయకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవిశంకర్ పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కోరారు. శుక్రవారం బీజేపీ 7వ మండల కమిటీని మండలాధ్యక్షుడు దేశలంక భాస్కర్ నివాసం వద్ద ప్రకటించారు. నాగేంద్ర మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడానికి నూతన కమిటీ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

అనపర్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఐటీసీ ఎంఎస్‌కే వాష్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం అనపర్తిలోని బాలికోన్నత పాఠశాలలో ఎంపిక చేసిన విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, తడి చెత్త పొడి చెత్తపై వినోదాత్మక ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం కర్రి కళ్యాణి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యామినీ	కెప్టెన్ అమెరికా
సూర్యాప్యాలస్	చావా
స్వామి	బ్రహ్మాఆనందం
శివజ్యోతి	తండేల్
అనుశ్రీ(సాయికృష్ణ)	లైలా
రాజా	సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	కాంప్లికేటెడ్
రంభ	ఆరెంజ్
మేనక	నిదురించు జహాపన, తల
అప్సర	తండేల్
కుమారి	కెప్టెన్ అమెరికా
అశోక	లైలా
వీఎస్ మహల్(నామవరం)	తండేల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	తండేల్
వెంకటసూర్య(కడియం)	లైలా, తండేల్
సత్యగౌరి (అనపర్తి)	లైలా
సూర్యశ్రీ (అనపర్తి)	తండేల్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	తండేల్
రామకృష్ణ(కోరుకొండ)	---
గీతాసినిమాస్ (సీతానగరం)	లైలా
శ్రీనివాస (గోకవరం)	తండేల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	లైలా
లలితామహల్(రంపచోడవరం)	తండేల్
నవయుగ(చింతూరు)	లైలా





అనకొండలు!

కొండలను మింగేస్తున్న దొంగలు


కొవ్వూరు మండలం దేచర్లలో తవ్వేసిన ఎర్రకొండలు

- రోజూ యథేచ్ఛగా తవ్వకాలు
- వందలాది లారీల్లో తరలింపు
- అక్రమార్కుల జేబుల్లోకి రూ.కోట్లు
- సర్కారు ఆదాయానికి గండి
- దేచర్ల,గౌరీపట్నంలో ఇదీ సీన్
- అయినా పట్టని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆ ప్రాంతానికి వెళితే ఎక్కడ ఉన్నామా అనిపించకమానదు.. ఎదుకంటే చుట్టూ కొండలు తవ్వేసిన గోతులే కనిపిస్తాయి.. కేజీఎఫ్ సినిమాలో తవ్వేసిన కొండలు ఎలా కనిపిస్తాయో ఇక్కడ కూడా అలాగే కొండలు మాయమై 50 అడుగుల లోతు ఉన్న గోతులు దర్శనమిస్తాయి. ఇదెక్కడో మారుమూల కాదండోయ్..జిల్లా కేంద్రం రాజమహేంద్రవరానికి సుమారు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న దేచర్లలో సీన్.. జాతీయ రహదారిపై వెళుతుంటే కారులో కూర్చున్నా అక్రమంగా తవ్వేసిన గ్రావెల్ గోతులు కనిపిస్తూనే ఉంటాయి. అయినా ఇప్పటి వరకూ ఏ ఒక్క అధికారి ప్రశ్నించిన దాఖలాలు లేవు.

కొండలు కరిగిపోయాయి..

కొండలు కొల్లగొడుతున్నారు.. అక్రమంగా కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు.. భూములను గుల్ల గుల్ల చేస్తున్నారు. జిల్లాలో ఎర్రమట్టి (గ్రావెల్) అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా ఈ అక్రమాలు మాత్రం ఆగడం లేదు. కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు, బోరుబావులు తవ్వేందుకు వాడే గులక రాళ్ల తవ్వకాలు బాగా పెరిగిపోయాయి. గత వైసీపీ హయాంలో ఇక్కడ అనేక హెక్టార్లలో కొండలు, ఎర్రమట్టి భూములు గోతులుగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొందరు పెద్దలుగా చలామణీ అయ్యే నేతల స్వార్థం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇసుక అక్రమ తవ్వకాలతో రోడ్డుకెక్కుతున్న నేతల వైఖరి మీద అనేక ఫిర్యాదులు వస్తున్న సంగతి తెలిసిందే. దానికి తోడు దేచర్లలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు పెరిగిపోవడం మరింత చర్చనీయాంశమవుతోంది. పంగిడి, గౌరీపట్నం గ్రామాల సమీపాన ఉన్న దేచర్లలో అనేక ఎర్రమట్టి కొండలు ఉన్నాయి.వాటిపై అక్రమార్కులు కన్నుపడింది. కనీసం ఏ విధమైన అనుమతులు లేకుండా యంత్రాలు పెట్టి తవ్వేసి,వందలాది లారీ గ్రావెల్‌ను తరలిస్తున్నారు.వీటి మీద కొందరు కూటమి నేతలే ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడ దందా బాగా పెరిగింది. గ్రామంలో మూడు నాలుగు చోట్ల గ్రావెల్ తవ్వేస్తున్నారు.అంతే కాకుండా రాతి కొండలను గుల్ల చేశారు.ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా కరిగిపోయిన పలు కొండలుదర్శనమిస్తాయి.లారీ గ్రావెల్ రూ.5 వేలకుపైగా విక్ర యిస్తున్నట్టు సమాచారం.ప్రభుత్వ అనుమతుల్లేకుండా తవ్వేస్తున్నా అడిగేవారే లేరు. గ్రామంలో ఎవరూ అడ్డుకునే సాహసం కూడా చేయలేక పోతున్నారు.

నేడు కొలతలు వేస్తాం..

ఇన్నాళ్లకు జిల్లా మైన్స్ అధికారులు మేమున్నామంటూ వచ్చారు..అది కూడా ఎవరి నుంచో వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దీంతో యంత్రాలను వదిలి అక్కడ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నవారు పరారయ్యారు. యంత్రాలను సీజ్ చేశారు. దీనిపై ఏడీ డి.ఫణిభూషణరెడ్డి ప్రశ్నించగా దాడులు చేసిన మాట వాస్తవమేనని.. దేచర్లలో ఎంత మేర అక్రమ తవ్వకాలు జరిగాయో శనివారం కొలతలు వేసి, సంబంధిత వ్యక్తులకు నోటీసులిస్తాం అన్నారు.

- డి.ఫణిభూషణరెడ్డి, మైన్స్ ఏడీ


ఎస్పీ కార్యాలయం వద్ద భారతానంద

గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

ఎస్పీకి భారతానంద వినతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణా అరికట్టాలని విశాఖ శ్రీ భారత్ శక్తి పీఠం అధ్యక్షులు, హిందూ మహాసభ దక్షిణ భారత ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ భారతానంద మహరాజ్ ఎస్పీ నరసింహ కిశోర్‌కి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా ఏపీ సరిహద్దు జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ నుంచి కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, రాజమండ్రి, విజ యవాడ గుండా ఇతర రాష్ట్రాలకు గోవుల అక్రమ రవాణా జరుగుతుందన్నారు. పోలీసులు కేసులు పెడుతున్నా ఫలితం ఉండడం లేదన్నారు. గోకవరం మండలం కృష్ణుడిపాలెంలోని గోశాలలో ఐదారేళ్లగా కొన్ని వేల పశువులను సంరక్షణలో ఉంచడం జరిగిందని, కానీ అక్కడ ఒక్క గోవు లేదన్నారు. దీనిపై ఎన్‌జీవో సంఘాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు.ఇప్పటికైనా గోవుల అక్రమ రవా ణా అరికట్టాలన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

రీ సర్వేకు 139 బృందాలు

గోకవరం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): రోజువారీ సర్వే బృందాలకు నిర్ధేశించిన ప్రకారం రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని జేసీ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. మల్లవరం గ్రామంలో రీ సర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనుల ప్రక్రియను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. సర్వే బృందాలు సగటున రోజుకు 15 ఎకరాల్లో సర్వే నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 139 బృందాలను నియమించామన్నారు. బృందాల నియామకం మేరకు తగిన పురోగతి కనిపించడం లేదన్నారు. జేసీ వెంట జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ,తహశీల్దార్ సాయిప్రసాద్, వీఆర్వో కోనా శ్రీను తదితరులు ఉన్నారు.


డ్రైవర్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న చెంగల్‌రెడ్డి

ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలందించాలి

ఆర్టీసీ జోనల్ ఈడీ చెంగల్‌రెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మెరుగైన, సురక్షిత రవాణా సేవలందించాలని ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ టి.చెంగల్‌రెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోను శుక్రవారం విజయవాడ జోన్ ఈడీ విజయరత్నంతో కలసి ఆయన సందర్శించారు. బస్‌స్టేషన్, గ్యారేజీలను పరిశీలించి మాట్లాడారు. ఆర్టీసీ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలన్నారు. కార్గో ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అధిక కేఎంపీఎల్, ఆదాయం తెచ్చిన డ్రైవర్, కండక్టర్‌లకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలను అందజేశారు. డిపో ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నం, గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా.. లాస్!

రైతు వద్ద కేజీ రూ.4లే

- భారీగా పడిపోయిన ధర
- పెరిగిన దిగుబడులే కారణం
- కోత ఖర్చులు రాక ఆందోళన
- చేలను దున్నేస్తున్న రైతాంగం
- రైతు బజార్లలో కేజీ రూ.12
- రూ.20 చేయాలని డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : టమోటా ధరలు పతనమవుతున్నాయి. రోజు రోజుకూ ధరల్లో తగ్గుదల నమోదవుతోంది. రైతుబజార్లలో నిన్నమొన్నటి వరకూ కిలో రూ.10లకే విక్రయించారు. రైతుకు గిట్టుబాటు కావడంలేదనే కారణంతో రూ.2లు పెంచి కిలో రూ.12 చొప్పున ధర పెట్టారు. మరోపక్క బహిరంగ మార్కెట్లలోనూ కిలో రూ.15 నుంచి రూ.20ల ధర ఉంది. సైకిళ్లు, రోడ్లపై తోపుడు బండ్లపై కూరగాయలు విక్రయించే కొందరు చిల్లర వ్యాపారులు కిలో రూ.15లకే అమ్ముతున్నారు. ఈ ఏడాది లోకల్‌గా కడియం, సీతానగరం తదితర మండలాలకు చెందిన రైతు బజార్ల రైతులు పెద్దఎత్తున టమోటా సాగు చేపట్టడంతో పంట రైతు బజార్లకు భారీగా వచ్చి చేరుతోంది. మరోపక్క రావులపాలెం సమీపంలోని మడికి పరిసర ప్రాంతాల్లోనూ టమోటా సాగు పెరగడం, దిగుబడి బాగుండడంతో జిల్లావ్యాప్తంగా అన్ని హోల్‌సేల్ మార్కెట్లకు టన్నుల కొద్దీ టమోటాలు వచ్చిపడుతున్నాయి. ఈ ఏడాది వాతావరణం పూర్తిగా అనుకూలించడం, చీడపీడల బెడద చాలా తక్కువగా ఉండడంతో దిగుబడులు గణనీయంగా పెరిగాయి. టమోటా కూడా మంచి రంగు, సైజు, నాణ్యతతో మదనపల్లి, బెంగళూరు రకాలను తలదన్నేలా క్వాలిటీతో ఉండడంతో వినియోగదారులు సంతృప్తితో కొనుగోళ్లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన హోల్‌సేల్ టమోటా వ్యాపారులు చిత్తూరు జిల్లా మదనపల్లి, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి చాలా వరకూ దిగుమతులను మానుకున్నారు. ఇతర ప్రాంతాల కంటే ఇక్కడే రేటు తక్కువగా ఉండడంతో హోల్‌సేల్ వ్యాపారులు లోకల్ టమోటాలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

10 కిలోలు రూ.40లే

ఈ ఏడాది టమోటా సాగు రైతులకు కలిసి రాలేదు..ఆరంభం నుంచి ధర తగ్గు తూనే ఉంది. గతేడాది కేజీ టమోటా రూ.230లు ధర పలకడంతో రైతులు బం గారు పంటగా భావించారు. ఈ నేపథ్యంలో రైతులు టమాటా సాగుపై దృష్టి సారిం చారు.దిగుబడులు పెరగడంతో ధర పడిపోయింది. హోల్‌సేల్ మార్కెట్‌లో 10 కిలోల టమాటా ధర రూ.40లు మాత్రమే పలుకుతుంది.అంటే కేజీ రూ.4లు అన్నమాట. దీంతో రైతులు కోతకు ఆలోచిస్తున్నారు. ఎందుకంటే కోత ఖర్చులు రావడం లేదు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెం దిన రైతు మాచవరపు ఆదినారాయణ అయితే అర ఎకరం పొలంలోని టమోటా పంటను దున్నేశాడు.జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇటువంటి పరిస్థితులు ఉన్నాయి.

రైతుల కోసం కమిటీలు

రైతులు గగ్గోలు పెడుతుండడంతో జిల్లా అధికారులు కూరగాయలను సాగు చేసే రైతును ఆదుకునేందుకు చర్యలు ప్రారంభించారు. రైతుబజార్లకు చెందిన రైతులతో పాటు కూరగాయలు సాగు చేసే ఇతర ప్రాంతాల రైతులకు కూడా గిట్టుబాటు ధర లభించేలా జిల్లా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్లతో ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ రైతుకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తుంది. రైతులు పండించిన కూరగాయల దిగుబడి ఎక్కువగా ఉండి, ధరలు పడిపోయిన సమయంలో జిల్లాలోని అన్ని రైతు బజార్లకు వాటిని తీసుకొచ్చి విక్రయిస్తారు.దీని వల్ల రైతు నష్టపోకుండా కనీసగిట్టుబాటు ధర లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

దిగుబడులున్నా.. ధర లేదు?



రైతు బజార్లలో కిలో రూ.10-రూ.12 పెడుతున్నారు. కనీసం రూ.15లు పెట్టినా ఫర్వాలేదు. రూ.20లు అమ్మితే కొంత లాభం వస్తుంది.ఈ ఏడాది దిగుబడులు బాగున్నాయి. ధర కూడా అదే స్థాయిలో ఉంటే బాగుండేది. ఎకరం సాగుకు రూ.40 వేలు ఖర్చు పెట్టా. ప్రస్తుతం పంట పండినా లాభం మాత్రం లేదు.

- కవల శ్రీనివాసరావు, రైతు, రాజంపేట, సీతానగరం మండలం

రైతుల కోసమే కమిటీలు



ధర తక్కువగా ఉంటే రైతు తాము పండించిన కూరగాయలను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతాడు. ఈ పరిస్థితిని నివారించేందుకు కలెక్టర్ ఆదేశాలమేరకు కమిటీ ఏర్పాటు చేశాం. రైతు బజార్లలో పంటను విక్రయించుకోవడం వల్ల రైతు నష్టపోకుండా ఉంటాడు.

- సునీల్ వినయ్, మార్కెటింగ్ అధికారి

శివరాత్రికి ఏర్పాట్లు చేయండి

- భక్తులకు ఇబ్బందిలేకుండా చూడాలి
- కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి
- అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.ఈ నెల 26వ తేదీన గోదావరి స్నానాలకు వేల సంఖ్యలో భక్తులు వస్తారని.. శివాలయాలు కిటకిటలాడతాయని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సీతానగరం మండలంలోని వంగలపూడి నుంచి పట్టిసీమ వీరభద్ర స్వామి దేవస్థానం, కొవ్వూరు గోష్పాదక్షేత్రం, రాజ మహేంద్రవరం పుష్కరఘాట్, మార్కండేశ్వర స్వామి దేవస్థానం, కోటిలింగాల ఘాట్లకు వేలాదిగా భక్తులు వస్తారన్నారు.పట్టిసీమలోని తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి వచ్చే భక్తులకు పుణ్యస్నానాలు, దర్శన సమాచారం అందే విధంగా కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.అన్ని శైవ క్షేత్రాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి ఘాట్‌లోనూ అవసరమైన బోట్లతో పాటు గజ ఈతగాళ్లను, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని చెప్పారు. రాజమహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లలోని మునిసిపల్ కార్యాలయాల్లో భక్తులకు సమాచారం అందించే కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా అన్ని శైవ క్షేత్రాల్లోనూ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్‌ఆర్‌డీఎఫ్ సిబ్బంది, రెస్క్యూ టీమ్, ఫైరింజన్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎల్.అర్జున్, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుష్మిత, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వేంకటేశ్వరరావు, డీపీవో శాంతామణి తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీశైలం స్పెషల్ టూర్

టూరిజం ఆర్డీ పవన్‌కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా రాజమ హేంద్రవరం -విజయవాడ-శ్రీశైలం ఒక పగలు, రెండు రాత్రుళ్ల ప్రత్యేక టూర్ ప్యాకేజీని అం దుబాటులోకి తెచ్చామని పర్యాటక శాఖ ప్రాం తీయ సంచాలకులు సీహెచ్.పవన్ కుమార్ వెల్లడించారు. 18 సీట్లు కలిగిన మినీ బస్ ఈ నెల 25న సాయంత్రం 4 గంటలకు పర్యాటక శాఖ కార్యాలయం నుంచి బయలుదేరి.. విజయవాడకు రాత్రి 9 గంటలకు చేరుకొని అక్కడి ప్రయాణికులను ఎక్కించుకొని శ్రీశైలం వెళుతుందన్నారు.27న రాత్రికి రాజమండ్రి తిరిగి చేరుకుంటుందని చెప్పారు.యాత్రలో శ్రీశై లంలోని భ్రమరాంబికా దేవి, మల్లికార్జున స్వామి, త్రిపురాంతకేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరీదేవి ఆలయాల దర్శనం ఉంటుందన్నారు. రాజమండ్రి నుంచి పెద్దలకు రూ.4,360, పిల్లలకు రూ.3,490, విజయవాడ నుంచి పెద్దలకు రూ.3,490, పిల్లలకు రూ.2,550 టిక్కెట్టు ధరగా నిర్ణయించామన్నారు. ఆహారం, ఇతర ఖర్చులు పర్యాటకులే భరించాలన్నారు. వివరాలు, బుకింగ్ కోసం 98486 29341 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

35 బ్లాక్ స్పాట్లు గుర్తించాం : జేసీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జేసీ చిన్నరాముడు ఆదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీతో సమీక్షించారు. జిల్లాలో జాతీయ రహదారులపై 27, రాష్ట్ర రహదారులపై 6, ఇతర 2 కలిపి మొత్తం 35 బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగిందన్నారు. బ్లాక్ స్పాట్లలో సరిపడా లైటింగ్, సైన్ బోర్డులు, బ్లింకర్లు, స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ రహదారుల్లోని కొన్ని ప్రదేశాల్లో గ్రీనరీ అభివృద్ధి చేయాలని సూచించారు.మోటార్ వాహనాల చట్టాన్ని అనుసరించి 2024లో 4వేల కేసుల ద్వారా రూ.8 కోట్ల 82 లక్షల 41 వేలు, 2023, 24లో 60 కేసుల్లో రూ.87 వేల 500 అపరాధ రుసుము కోర్టులు విధించాయన్నారు. రహదారి భద్రతపై అవగాహన కార్యక్ర మాల్లో ఎన్‌జీవోలు చొరవ చూపాలన్నారు.నేషనల్ హైవే హెల్ప్ లైన్(ఎమర్జెన్సీ) నెంబరు 1033పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు అరికట్టాలని చెప్పారు. శబ్ద కాలుష్య నివారణకు అనవసరంగా హారన్ మోగించకుండా సూచన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలకు వాహనం ఇస్తే తల్లిదండ్రులు కేసులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణకు హెల్మెట్, సీట్ బెల్టులను ధరించాలన్నారు. 2024లో మోటారు వాహనాల డ్రైవింగ్ నిబంధనల ఉల్లంఘనలపై 84 వేల కేసులు నమోదు చేసి రూ.3 కోట్ల 30 లక్షలు జరిమానా విధించామని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేశ్ పేర్కొన్నారు. 2025లో జనవరిలో 10 వేల కేసులు పెట్టి రూ.41 లక్షలు జరిమానా వసూలు చేశామన్నారు.కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ ఎస్‌బీవీ రెడ్డి,డీఎం హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు,ఎన్ హెచ్ఏఐ పీడీ డి.సురేంద్రనాథ్,డీవైఈవో వాసుదేవరావు,ఆర్ఎంవో వినూత్న పాల్గొన్నారు.

చిట్యాలలో రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం 8

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



రాజమహేంద్రవరం అర్బన్ : రాజమహేంద్రవరంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఇన్నీసుపేట బ్రాంచి వద్ద శుక్రవారం సాయంత్రం ఉద్యోగులు ధర్నా చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మార్చి 3వ తేదీన దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని.. దానికి మద్దతుగా శుక్రవారం ధర్నా చేశామని బ్యాంకు ఉద్యోగుల సంఘం (యూఎఫ్‌బీయూ) నాయకులు పాపారావు, శ్రీనివాసరావు తెలిపారు.

ప్రచార జోరు



ఎమ్మెల్సీ ఎన్నిక దగ్గర పడుతోంది.. ఇక మిగిలింది నాలుగు రోజులే.. ఎందుకంటే ఈ నెల 27వ తేదీనే ఎన్నికలు జరుగనున్నాయి.. ఈ నేపథ్యంలో నాయకులు ప్రచార జోరు పెంచారు..ఊరూవాడా పర్యటిస్తున్నారు.. పట్టభద్రులను కలుస్తున్నారు.. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.. పెరవలి మండలం ఖండవల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్‌ని చూడవచ్చు.

8

నిర్మలగిరి పుణ్య క్షేత్రంలో బుద్దా వెంకన్న ప్రార్థనలు



వెంకన్నను సన్మానిస్తున్న గౌరీపట్నం మేరీమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, నాగేశ్వరరావు

దేవరపల్లి, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం మేరీమాత పుణ్యక్షేత్రాన్ని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న శుక్రవారం సందర్శించారు. ఈయనకు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, అన్నదాన ట్రస్ట్ కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పుణ్య క్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ ఆశీర్వదించారు. ఈయనతో పాటు విజయవాడ కార్పొరేటర్ చంటి, కూటమి నేతలు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ తరగతులు



అవగాహన కల్పిస్తున్న మహిళా రక్షక్ టీం, ఎస్‌ఐ రామకృష్ణ

తాళ్లపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి పది, ఇంటర్ కీలకమని, ఈ వయసులో తీసుకునే నిర్ణయాలే రేపటి భవిష్యత్‌కు బంగారు బాట అవుతుందని మహిళా రక్షక్ టీమ్ సభ్యుడు, ఏఎస్‌ఐ రామన్న తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం అన్నదేవ రపేట, వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళా విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా ఆడపిల్లలకు ఇబ్బంది కలిగితే వెంటనే రక్షక్ నెంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ పోలీస్‌స్టేషన్ రక్షక్ టీం శైలజ, భవ్య, భవాని, అనిత, తదితరులు పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకుపై పంటకోత ప్రయోగం



అన్నదేవరపేటలో పంటకోత ప్రయోగంలో ఏఎస్‌వో జోడాల, రైతులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలోని దుగ్గిరాల సుబ్బారావు, పోసిన నారాయణరావుకు చెందిన పొలాల్లోని వర్జీనియా పొగాకుపై శుక్రవారం పంటకోత ప్రయోగం చేసినట్టు ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో అన్నదేవరపేట, పోచవరంలో పొగాకు పంటకోత ప్రయోగాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సతీష్, రైతులు సుబ్బారావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పొలంబడి



వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు వెంకట నరసింహారావు, శ్రీనివాస్

కొవ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రబీ వరి పంటకి మచ్చ కంకి నల్లి ఆశించిందని, రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే పంట దిగుబడి పెంచుకోవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా. చల్లా వెంకట నరసింహారావు, డా. మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. ధర్మవరంలో శుక్రవారం వ్యవసాయాధికారి ఏ. గంగాధర్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వరి పొలాలను క్షేత్రసందర్శన చేశారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పంటను చీడపీడలు తక్కువగా ఆశించాయని, దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. నివారణకు స్పైరో మెసిఫెన్ 1.0 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎస్. శ్రీనివాస్, వి.ఎ.ఎ జ్ఞానదాస్, అభ్యుదయ రైతులు కాకర్ల సురేష్, కుందుల రమేష్, కె. మోహన్, పులపా గోపాలకృష్ణ, పెన్నేటి రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : డీఈవో



చిట్యాల హైస్కూల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో వాసుదేవరావు

గోపాలపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని డీఈవో కే.వాసుదేవరావు అన్నారు. చిట్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 42వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ క్రీడాకారులు తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్రీడాప్రాంగణాన్ని తీర్చిదిద్దిన పీఈటీ గద్దే చంద్రశేఖర్‌ను అభినందించారు. క్రీడల్లో పాల్గొన్న 14 జిల్లాల క్రీడాకారులకు ఆయన శుభాభివందనాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జీ.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, రవీంద్ర, కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, దాతలు నందిన సుబ్రహ్మణ్యం, గద్దే హరిబాబు, కొండేపాటి రత్నాజీ, సీఆర్‌పీ కొయ్యేనాగరాజు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

● ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి
● శంభూనగర్ పీహెచ్‌సీలో ప్రత్యేక మెడికల్ క్యాంపు



పోషకాహార కిట్స్ అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గర్భిణీలు, పాలిచ్చే తల్లులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని శంభూనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ కేంద్రం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో పౌష్టికాహార కిట్స్‌ను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా పీడీ విజయకుమారి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు ఐరన్, కాల్షియం, విటమిన్లు కల్గిన ఆహారం తీసుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎస్‌ఆర్ యాక్టివిటీలో భాగంగా కిట్స్ అందజేయడం అభినందనీయమన్నారు. ప్రత్యేక వైద్యశిబిరంలో 125 మంది గర్భిణులు, బాలింతలకు, 75 మంది మూడేళ్లలోపు చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించామని చెప్పారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. రామకృష్ణ మిషన్ కేంద్రం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్వామి రఘువీరానంద మహరాజ్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ పథకంలో భాగంగా పోషకాహార కిట్స్ పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ మణికంఠ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి.ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చూసేయ్ ఖాళీ జాగా...

● కొవ్వూరు పట్టణంలో ఆక్రమణల పర్వం

వేసేయ్ పాగా

● ప్రధాన రహదారుల్లో అక్రమంగా వెలుస్తున్న బడ్డీకొట్లు
● కుచించుకుపోతున్న రహదారులు
● చోద్యం చూస్తున్న అధికారులు



పెట్రోల్‌బంకు సెంటర్ టర్నింగ్‌లో ఆక్రమణకు గురైన రోడ్డు



ఆర్టీసీ డిపో గోడ పక్కన...

కొవ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు కాదేది అనర్హం అన్నట్టుగానే కొవ్వూరు పట్టణంలో ఈ పరిస్థితి ఉంది. ప్రభుత్వ స్థలాలు, చెరువు గట్లు, కాలువ గట్లు, ప్రధాన రహదారులను వదలకుండా అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ మూసుకుపోతున్నాయి. మరికొన్ని చోట్ల అయితే అక్రమ నిర్మాణాలు, బడ్డీ కొట్ల ఏర్పాటుతో రోడ్లు కుచించుకుపోతున్నాయి. ఇంత జరుగుతున్నా .. పురపాలక సంఘ అధికారులు కళ్లు అప్పగించి చూస్తున్నారు తప్పా.. చర్యలు శూన్యం. ఒకవేళ అధికారులు చర్యలు తీసుకోవడానికి ముందుకొచ్చినా .... ఒక్కొక్క బడ్డీ కొట్టు యాజమానికి స్థానిక నాయకులు అండగా నిలుస్తుండడంతో మనకెందుకులే అన్నట్టు అధికారులు చూసీచూడనట్టు వెళ్లిపోతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న భవన యజమానులు మరింతగా రెచ్చిపోయి రోడ్లపైకి వచ్చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏళ్ల తరబడి రోడ్ల విస్తరణ చేపడతున్నామని అధికారులు చెబుతున్నారు తప్ప.. అది క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. తాజాగా ఏసీఆర్ లాడ్జి నుంచి పెట్రోల్ బంకు రోడ్డు టర్నింగ్‌లో చిన్న బడ్డీని ఏర్పాటుచేశారు. అనంతరం అంచెలంచెలుగా అది పెద్దగా షాపుగా మారడంతో నందమూరు రోడ్డులోని బుద్దుడి బొమ్మ నుంచి పెట్రోల్‌బంకు, బంకు నుంచి పట్టణంలోకి వచ్చే దారిలో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే ఆర్టీసీ బస్ డిపో చుట్టూ, జూనియర్ కళాశాల ఎదుట, థియేటర్ రోడ్డులోని పంచాయతీరాజ్ కార్యాలయం ఎదురు, మున్సిపల్ కార్యాలయం నుంచి వెటర్నరీ ఆసుపత్రి గోడ వెంబడి, ఆంధ్రాషుగర్స్ ఫ్యాక్టరీ క్లబ్ నుంచి జీఎస్ రావు కల్యాణ మండపం వరకు, ఆర్డీవో కార్యాలయం ఎదురు, గోష్పాదక్షేత్రం ఎదురు, రోడ్డు కం రైలు బ్రిడ్జి టోలిగేట్ సెంటర్‌లోని వాడపల్లి రోడ్డు, ఆర్‌సీఆర్‌బీ టోలిగేట్ సెంటర్ నుంచి మెరకవీధి పెట్రోల్‌బంకు వరకు, ఇం దిరమ్మకాలనీలోని పలు రోడ్లు, ఇలా ఎక్కడపడితే అక్కడ పట్టణమంతా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది.

కొవ్వూరు పట్టణంతో పాటు గ్రామాల్లోనూ ఈ రకమైన ఆక్రమణలు కొనసాగుతున్నాయి. టోల్‌గేట్ సెంటర్ నుంచి ఔరంగాబాద్, వాడపల్లి, బంగారమ్మపేట, మద్దూరు, సీతంపేట, విజ్జేశ్వరం సెంటర్ వరకు, ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి, దొమ్మేరు, కాపవరం, పంగిడి, ధర్మవరం, వేములూరు, తొగుమ్మి, పశివేదల గ్రామాలలో సైతం రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. రాత్రి సమయంలో అయితే అం బులెన్స్‌లు వెళ్లే దారి లేక అత్యవసర పరిస్థితిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక నైనా అధికారులు స్పందించి రోడ్లను ఆక్రమించి వ్యాపారులు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు వెంటనే తొలగించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల మున్సిపాల్టీకి ఆదాయం పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.



పీఆర్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ఏర్పాటుచేసిన బడ్డీ కొట్లు



ఆంధ్రా సుగర్స్ ఫ్యాక్టరీ క్లబ్ పక్కన ఇలా..

మాతృభాషను మరవొద్దు : మంత్రి దుర్గేష్



నిడదవోలులో మాతృభాషా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మనమంతా మాతృభాషను మరవొద్దని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కళాశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయవృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలుగు భాషా వ్యాప్తికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో యువత తమ ప్రాధాన్యత ఓటును ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేసి గెలిపించాలని మంత్రి దుర్గేష్ కోరారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, రంగా రమేష్, బండి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఖండవల్లిలో మంత్రి ప్రచారం

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పెరవలి మండలం ఖండవల్లిలో శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్దఎత్తున చేస్తుందన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు రాజశేఖరానికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఉండ్రాజవరం మండలం పాలంగిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా పెరవలి మండలంలోని తీపర్రు మీదుగా మార్టేరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను మంత్రి పరిశీలించారు.

ఉండ్రాజవరం/పెరవలి: పెరవలి మండలం కాకరపర్రు హైస్కూలులో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో అష్టదిగ్గజ కవులు, కవయిత్రులు, ఏకపాత్రాభినయాలు, తెలుగు పాటలకు నృత్యాలు చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసారు. హెచ్‌ఎం శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, హరిబాబు, సత్యవరలక్ష్మి, సుల్తానా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్లక్ష్యం చేయరాదు

● ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రా సుగర్స్ జేఎండీ అచ్చిబాబు

కొవ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్లక్ష్యం చేయరాదని టీడీపీ సీనియర్ నేత, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికలతోనే డౌన్‌ఫాల్ ప్రారంభమవ్వాలన్నారు. అలాగే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మన నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ వచ్చేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే నమూనా పోస్టల్ బ్యాలెట్‌ను చూపించి ఓటు ఏ విధంగా వేయాలన్నదానిపై అవగాహన కల్పించారు. ఎన్నికల పరిశీలకులు గొర్రెల శ్రీధర్, కోట్ని బాలాజీ మాట్లాడుతూ ఓటర్ల నమోదులో కొవ్వూరు నియోజకవర్గం రెండో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, ఎంపిపి కాకర్లనారాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు, నాదెళ్ల శ్రీరామ్, రాజీన శ్రీనివాస్, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, బీజేపీ నాయకులు పిల్లలమర్రి మురళీకృష్ణ, సలాది సందీప్, జనసేన నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, ఉప్పులూరి చిరంజీవి, మూడు మండలాలకు చెందిన కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

చాగల్లు, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ ఎం. వీరాస్వామి అధ్యక్షతన జరిగింది. కోడ్ అమలులో ఉన్నందున సమావేశంలో ఎటువంటి చర్చలు, తీర్మానాలు లేకుండానే మమ అనిపించారు. ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ నిర్ణీత సమయంలోపు సమావేశం జరగవలసి ఉన్నందున తప్పనిసరి పరిస్థితిలో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఫేయిర్‌వెల్ డే



బాలుర జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మేరీ సుజాత

నిడదవోలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యను అభ్యసించి వెళుతున్న సీనియర్ విద్యార్థులను జూనియర్ విద్యార్థులు అభినందించి పంపడం మంచి సాంప్రదాయమని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. మేరీ సుజాత అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో ఫెయిర్‌వెల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలవుతున్నాయని, అందుకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. అనంతరం జూనియర్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏసురత్నం, బీ.రామమోహనరావు, బాలకృష్ణ, వెంకటరమణ, రాజ్‌కుమార్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వడ్లూరులో వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వడ్లూరులో తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులచే శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గుండె, ఎముకలు, కంటి, ప్రసూతి, చెవి, ముక్కు, నరాల వ్యాధులకు సంబంధించి రోగులను పరీక్షించారు. సుమారు 100 మంది రోగులకు పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆనందం మస్తాన్ రావు, కార్యదర్శి కఠారి సిద్ధార్థ, లయన్స్ క్లబ్ నాయకులు అక్కిన కాశీవిశ్వనాథం, వీ. పార్వతమ్మ, పవన్‌రాజు, కే. సత్యనారాయణ, సర్పంచ్ తేజశ్రీ, నాయకులు వేండ్ర రమేష్, పంపన త్రిమూర్తులు, వీ. సీతారాం, పీ.వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.

గోదారిలో శవమై తేలాడు

● ఇసుక ర్యాంపులో యువకుడి మృతదేహం లభ్యం
● అదృశ్యమైన సాయితేజదిగా గుర్తింపు



గగ్గులోతు సాయితేజ (ఫైల్)

కొవ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో దూకి అదృశ్యమైన యువకుడి మృతదేహాన్ని ఎట్టకేలకు పోలీసులు శుక్రవారం గుర్తించారు. ఔరంగాబాద్ ఇసుక ర్యాంపు సమీపం లో ఉన్నట్టు గురువారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. తర్వాత కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగిం చారు. ఈ నెల 19వ తేదీన రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గులోతు సాయితేజ (25) అదృశ్యమైన విషయం పాఠకులకు తెలిసిందే. మృతదేహం లభ్యం కావడంతో సాయితేజది అని నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసును మార్పు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు.

వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

నల్లజర్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రకాశరావుపాలెంకి చెందిన వివాహిత పట్ల అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్ అసభ్యంగా ప్రవర్తించడంతో శుక్రవారం అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ సోమరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... గురువారం మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించి సదరు వ్యక్తి ప్రవేశించాడు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట మహిళలపై ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఏఎస్‌ఐ జె. ధర్మరాజు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి... కాపవరం గ్రామానికి చెందిన కొక్కిరిపాటి బాబీ పంగిడిలోని అమెజాన్ ఆఫీసులో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీ రాత్రి 9:30 నిమిషాలకు పనిముగించుకుని ఇంటికి వస్తుండగా పంగిడి శివారులో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పైనుంచి కిందపడిపోయిన బాబీ తలకు, నుదుటి పైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.